| Title of the Work | Title of the Work |
|---|---|
| 1. మడిమెను పట్టుకొనినవాడు | 2. నా కుమారి (రూతు) |
| 3. జప్నత్పనేహు | 4. నా స్నేహితుడు |
| 5. ఆసెనతు | 6. హన్నాకృప సజీవసాక్ష్యాలు - 1 |
| 7. అపొస్తలుడు | 8. హన్నాకృప సజీవసాక్ష్యాలు - 2 |
| 9. బర్నబా | 10. ప్రయాణంలో ఓ మజిలీ |
| 11. తిమోతి | 12. నాజరు (సమ్సోను జీవిత చరిత్ర) |
| 13. నా చిత్తానుసారుడు | 14. సువార్తలలోని యేసుకథ |
| 15. గుంట నుండి మింటికి | 16. యేసుకథ రెండవ భాగము |
| 17. విశ్వాసంలో ఓ మెట్టు | 18. యేసుకథ మూడవ భాగము |
| 19. విశ్వాసంలో మరో మెట్టు | 20. జీవనమంతయు |
| 21. తోటలో పనివాడు | 22. విశ్వాసము విజయము -1 |
| 23. గోత్రకర్త (యాకోబు) | 24. విశ్వాసము విజయము -2 |
| 25. నా కుటుంబము | 26. విశ్వాసము విజయము -3 |
| 27. నా దూత (బాప్తిస్మమిచ్చు యోహాను) | 28. హదస్సా |
| 29. మిక్కిలి సాత్వికుడు | |

WHEREAS, **KODAVATIKANTI EMMANIAL RAJENDRA (Aadhar No: 5663 3849 4932)** S/o. Samuel Rajendra, aged about 56 years and resident of D.No: 54-1-24, Clough Peta 5th Line, Ongole, Prakasam District, Andhra Pradesh – 523 001 (hereinafter termed **ASSIGNEE**), is desirous of acquiring the entire right, title, and interest in and to said WORKS and in and to any copyrights thereon arising and/or granted in the Andhra Pradesh/India and foreign countries;

NOW, THEREFORE, the AUTHOR in consideration of the natural love and affection for the ASSIGNEE, the latter being the SON, the AUTHOR hereby transfer and assure to the use of the ASSIGNEE, freely and voluntarily, the **"WORKS"** mentioned and described above.

NOTARY
B. SURYANARAYANA
Prakasam District (A.P.)

ATTESTED

17/5/2023

B. SURYANARAYANA
Advocate Notary
Regd. No: 163/09
Opp: Municipal Office, 2nd Gate, ONGOLE
Prakasam (Dt.), (A.P.), India.
Cell: 9573909169

జూలై-2023

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక


గౌరవ సంపాదకులు :

**కె. సామ్యేల్ రాజేంద్ర**

సంపాదకులు :

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**

**చందా వివరాలు :**

సంవత్సర చందా రూ. 350/-

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-

**చిరునామా :**

ఎడిటర్, హన్నాకృప

పోస్ట్‌బాక్స్ నెం. 51 , క్లాపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

సెల్ : 9440217726

**బ్యాంక్ అకౌంట్ వివరాలు :**

A/c Name: **K. Emmanial Rajendra**

A/c No.: **10957294340**

Bank: SBI Main Branch, Ongole

IFSC Code : SBIN0000890


## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 03 |
| జప్పుత్వనేహు | కొడవటికంటి | 04 |
| స్టుపిడ్, రాస్కెల్ | కె.ఇ. రాజేంద్ర | 07 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 08 |
| ప్రిస్కిల్ల | హన్నాకృప డెస్క్ | 10 |
| యేసు పలుకులు | హన్నాకృప డెస్క్ | 12 |
| కరపత్రము | సాక్ష్యము | 14 |
| చిన్న ఓడ | చిన్నపిల్లల పేజి | 17 |
| కృపాదానం | కొడవటికంటి | 19 |
| దేవుడు – సిరి | హన్నాకృప డెస్క్ | 21 |
| దేవుడు మీ కన్నీరు... | కె.ఇ. రాజేంద్ర | 22 |
| పరిశుద్ధగ్రంథపరిశోధనా పట్టిక-12 | | 23 |



**HANNA KRUPA**


Christian Devotional Monthly Magazine

సంపుటి : 20 సంచిక : 7


ప్రభువగు యెహోవాయే నాకు బలము

సీరియల్ నంబరు

# సంపాదకీయం....



హన్నాకృప  పాఠకులకు  ప్రభువు  నామమున వందనములు.

ఇప్పటి వరకు 'హన్నాకృప'ను, అలాగే రచయితగా నేను వ్రాసిన పుస్తకాలను విశేషముగా ఆదరిస్తున్నందుకు మీకు నా కృతజ్ఞతలు. 1999లో నా కుమారుడు ప్రారంభించిన 'నిత్యజీవజలము' మాసపత్రికకు పోస్టల్ రాయితీ లేనందువలన 2003లో 'హన్నాకృప'గా పేరు మార్చి,  ఇప్పటి వరకు అనగా 20 సంవత్సరాలు  నడిపించాను. ఇప్పుడు నా వయస్సు 83 సంవత్సరాలు. ఇప్పటికే 'హన్నాకృప' పత్రిక బాధ్యతలను నా రెండవ కుమారుడైన ఇమ్మానియేలు రాజేంద్రకు అప్పగించియున్నాను. గత సంవత్సరము నుండి పత్రిక బాధ్యతలను సక్రమముగా నిర్వహిస్తూ, ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ పత్రిక ఆగకుండా సమర్థవంతముగా నడిపిస్తున్నందుకు నా కుమారుడు ఇమ్మానుయేలు రాజేంద్రకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అలాగే నేను వ్రాసిన నా పుస్తకములు అన్నిటి మీద కాపీరైట్ హక్కులను, పుస్తకములు ముద్రించుటకు, అమ్ముటకు  నా కుమారుడైన ఇమ్మానుయేలు రాజేంద్రకు సంపూర్ణముగా అప్పగిస్తున్నాను. నేను వ్రాసిన పుస్తకాలు కావలసిన వారు నా కుమారుడిని సంప్రదించవలసినగా కోరుచున్నాను.

పత్రిక ముద్రించడం ఎంతో వ్యయప్రయాసలతో కూడుకొనినదైనప్పటికీ, కేవలం దేవుని మీద ఆధారపడి నడిపిస్తున్నాము. అయినప్పటికీ పాఠకుల భాగస్వామ్యము ఎంతో అవసరం . కాబట్టి ఈ మా సాహిత్య పరిచర్యలో మీరు సహకరిస్తారని కోరుతున్నాను. దయచేసి చందా కట్టని వాళ్ళు, మీ సంవత్సర చందా కట్టి పత్రిక అభివృద్ధికి తోడ్పడవలసినదిగా కోరుచున్నాను. మీరు ఫోన్‌పే ద్వారా చందా పంపాలనుకుంటే పత్రికలో 5వ పేజీలో ముద్రించబడిన క్యూఆర్ కోడుని ఫోన్‌పే ద్వారా స్కాన్ చేసి పంపవచ్చును.  మీరు ఫోన్‌పే ద్వారా చందా కట్టినట్లయితే దయచేసి మాకు  9440217726 నంబర్‌కి ఫోన్ చేసి చెప్పండి లేదా  మీ పేరు, పత్రిక అడ్రస్ లేబుల్ మీద మీ సీరియల్ నంబర్, ట్రాన్స్‌ఫర్ చేసిన మొత్తం SMS చెయ్యండి. దేవుడు మిమ్మును సదాకాలము దీవించును గాక! ఆమెన్!

-కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర

**K. Emmanial Rajendra,  SBI Main Branch, Ongole**
**A/c No. 10957294340**

సీరియల్



# జఫ్నత్పనేహు

(యోసేపు జీవిత చరిత్ర)

- కొడవటికంటి

నాకు ఊహ తెలిసిన దగ్గర్నుండి మా అక్కే నా నేస్తం. అన్నలందరూ పెద్దవారైనందున వాళ్ళతోనేను ఆడుకోలేదు. బానిసలకు చాలామంది పిల్లలున్నా నన్ను వాళ్ళతో కలిసి ఆడుకోనిచ్చేవారు కాదు. అందరూ నన్ను 'చిన్నరాజా!' అని ఎత్తుకొని తిప్పేవారు. మా అక్క కూడా నన్ను చాలా ముద్దుగా చూసేది. కొంచెం కూడా కష్టం రానిచ్చేది కాదు. మా అక్క దీనా పెళ్ళయిన తర్వాత అమితమైన దుఃఖంలో మునిగి పోయింది. పెళ్ళి కాకుండానే విధవ అయింది. నాకు స్నేహం కరువైంది. ఆమె దుఃఖం నేను తీర్చలేనిది. ఆమె ఇక కనబడటం మానేసింది.

మా తండ్రి, మా తమ్ముణ్ణి ఎప్పుడూ, ఒక్క క్షణం కూడా వదలి ఉండడు. అందువల్ల నేను ఎప్పుడూ మా తాత దగ్గర ఉండేవాడిని. ఆయన చాలా ముసలాయన. ఆయనకు రెండు కళ్ళూ కనబడవు. అయినా ఆయన అనుభవాలు చాలా గొప్పవి. ఎప్పుడూ నాకు దేవుని మాటలే చెప్పేవాడు. నన్ను గారాబంగా పెంచారు. నేను ఎవరో, ఏమిటో, మనిషికి విలువ దేనివలన వస్తుందో ఇవన్నీ నాతో ఎవరూ చెప్పలేదు.

ఇప్పుడు ఈ ప్రయాణంలో మొదటిసారిగా తెలుసు కున్నాను నేనెంత అల్పుడనో, మనిషంటే ఏమిటో, ప్రపంచ మంటే ఏమిటో! ఈ ఒంటెలు ఎందుకు జీవిస్తున్నాయో, ఈ ఇసుక ఎంత శక్తివంతమైనదో. చూడు! దేవుడు ఎంత గొప్ప నీటి సమూహమును, అది పొర్లిపోకుండా గట్టిగా దానిని కట్టడ చేయలేదు గాని ఇసుకతో దానికి కట్టవేశాడు. ఈ సృష్టిలోని అందాన్ని చూసి సృష్టికర్త యొక్క జ్ఞానాన్ని అర్థం చేసుకున్నాను. బానిసలు నాకంటే ఎంతో గొప్పగా కనిపించారు. కొంచెం కష్టంతోనే జ్ఞానాన్ని ఉపయోగించాలి. అంతేసి బరువులు ఒంటెల మీద ఎలా కట్టగలిగారు? నాకైతే ఒక త్రాడును ఎలా ముడివెయ్యాలో ఇప్పటికీ తెలీదు. కాని ఈ బానిస ఒక సన్నని తాడును ఎన్నో రకాలుగా ముడి వేయగలడు. ఎంత కష్టమైన పనైనా ఆవేశపడకుండా చేస్తాడు. ఆహారం ఇవ్వక పోయినా, నీళ్ళు ఇవ్వక పోయినా ఇచ్చేంత వరకు ఓపికతో ఎదురుచూసే, భారమైన బరువులు మోసే ఈ ఒంటెలకున్న సహనంలో నాకు వెయ్యో వంతు కూడా లేదే!

ఇవన్నీ చూస్తుంటే నేనెంత అల్పుడనో నాకు అర్థమవు తుంది. అయితే నేను కూర్చునే పద్ధతి, మాట్లాడే తీరు, నాలోని రాజ ఠీవి అని నువ్వు అనే గుణాలు నా రూపం లోను, నా ఆకారంలోను, నా హృదయంలో నుండి మాయమై పోయినప్పుడు, దేవుని గూర్చిన జ్ఞానం నాలో పరిపూర్ణత చెందుతుందేమో అనుకుంటున్నాను వియాన్!" అని ఆగి "ఇందాక ఎదోమీయులు అని అన్నావే, వారు మా హెబ్రోనుకు క్రిందుగా ఉన్న బెయెర్షెబాకు ఇంకా దిగువలో నివసించే వారేనా? వారు మా పెద్ద తండ్రి ఏశావు సంతానం నీకు తెలుసా?" అన్నాడు యోసేపు.

"అదేమో నాకు తెలియదు. కాని వారు ఐగుప్తులో మనమెళ్ళే మెంఫిస్‌కు రారు. వారు దక్షిణ దేశము అంటే తెబెస్ పట్టణం, మనకు దాదాపు నాలుగు వందల మైళ్ళ దూరంలో ఉంది. అది కూషు దేశమునకు ఆనుకొని ఉంది. అక్కడ వ్యాపారం చేస్తారు. వాళ్ళు అక్కడ నుండి కోతులు, బంగారం, నెమళ్ళు తీసుకొని వెళ్తారు" అని చెప్పాడు వియాన్.

"నిజమే కాని, వారు ఎదోము నుండి నేరుగా వెళ్ళ టానికి మధ్యలో ఎర్రసముద్రం ఉంది కదా! కాబట్టి ఇప్పుడు మనం విడిది చేసిన ఈ ప్రాంతానికి కొంచెం దిగువలో ఎర్రసముద్రం ఆగిపోతుంది. ఆ ఎర్రసముద్రం రెండు పాయలుగా చీలిపోతుంది. ఆ రెండు పాయల మధ్య బహు విశాలమైన పీఠభూమి ఉంది. అందులోనే సీనాయి పర్వతం ఉంది. నేల మీద ప్రయాణం చేసి రావాలంటే ఎవరైనా ఆ మహా సముద్రం, ఎర్రసముద్రం పాయ కొనకి మధ్యలో

ఉండే తిమ్సా సరస్సు ప్రక్కనే రావాలి. ఎర్రసముద్రం ఎడమపాయ దగ్గరికి వెళ్తే అది తుంగతో నిండిపోయి ఉంటుంది. దాని మధ్య దూరం వంద మైళ్ళ లోపల ఉండ వచ్చు" అని విశ్రాంతిగా పండుకున్నాడు వియాన్.

యోసేపు కూడా వెల్లకిలా పండుకొని మహా సముద్రం, తిమ్సా సరస్సు, ఎర్ర సముద్రపాయలు, ఎడమపాయ, కుడి పాయ, సీనాయి పర్వతము ఇవన్ని మెదడులో గుర్తించటానికి ప్రయత్నిస్తున్నాడు. అంతలో ఏదో ఆలోచన వచ్చినట్లు....

"వియాన్!" అని చిన్నగా పిలిచాడు.

"ఊ..!" అని ఇటు తిరిగాడు వియాన్.

"ఒకవేళ ఈ మహాపట్టణంలో నుండి సగం మంది అనుకోకుండా ఏదైనా అవసరం వచ్చి తూర్పుదేశాలకు వెళ్ళాలంటే ఈ సముద్రాన్ని చీల్చుకొని పోవాల్సిందేనా?" అడిగాడు యోసేపు.

"అంతేకాదు, ఈ ఎర్రసముద్రాన్ని చీల్చకుండా ఈ ఎడమ పాయను ఒక వందమైళ్ళు త్రవ్వుకుంటూ పోతే మధ్యధరా సముద్రాన్ని, అరేబియా సముద్రాన్ని రెండింటిని ఒకటి చెయ్యొచ్చు. అలా చేస్తే ఈ ప్రయాణం చిన్నదైపోయి ఈ ఐగుప్తు దేశపు ఓడలు అరేబియా సముద్రంలోకి అడ్డదారిన పోయినట్లు త్వరగా పోవచ్చు తెలుసా?" చెప్పాడు వియాన్.

"వియాన్! ఈ దేశం గురించి, దాని నదుల గురించి, సముద్రాల గురించి, ఎడారుల గురించి, నీవెలా తెలుసు కున్నావు?" అడిగాడు యోసేపు.

"నీకంటే నేను పది సంవత్సరాలు పెద్దవాడిని. నీకు చిన్నతనంలో అమ్మ చనిపోతే, నాకు చిన్నతనంలోనే అమ్మా, నాన్న ఇద్దరూ చనిపోయారు. నాకు పది సంవత్సరాల వయస్సులో నేను ఈ యూషనుకి అమ్మబడ్డాను. కాని ఆయన నన్ను కుమారునిలాగా చూశాడు. అయినా నేనెప్పుడూ చనువుగా ప్రవర్తించలేదు. ఆయన యెడల నాకు తండ్రి భావన ఉంది. ఆ ప్రేమ చాలు! ఇక నేనేమి కోరు కోవటం లేదు. ఒకవేళ నా తల్లిదండ్రులు చనిపోక పోయుంటే నేనింత జ్ఞానము సంపాదించి యుండేవాడను కాదు. యూషను సొంత తమ్ముడు పిరమిడ్ దగ్గర ఉండే రాజుగారి రథశాలకి అధిపతి. అందువల్ల ఈ రాజ్యములో నేనెక్కడ తిరిగినా నాకు అపాయం లేదు.

నీ సహచర్యంలో ఈ కొద్ది రోజులలో ఈ లోకానికి దేవునికి ఉన్న సంబంధం ఏమిటో అర్థమవుతుంది. తెలుసు కోవాల్సింది చాలా ఉంది. అసలు ఏమీ తెలుసుకోలేదేమో అనిపిస్తుంది. కానీ నాకిది ఏమంత సంతోషకరమైనది కాదు. ఎందుకంటే మనం త్వరలో విడిపోతాము. మరలా కలుసు కుంటామని నమ్మకంలేదు. ఇంతకు ముందు యూషను కొంతమంది బానిసలను కొన్నాడు, అమ్మాడు. కానీ నీలాంటి వాడిని నేను చూడలేదు. యజమాని కూడా చూడ లేదు. ఎందుకంటే నీ తండ్రి చాలా బలవంతుడు. అవసరమైతే ఆయన తరపున చాలామంది యుద్ధం చేయగలరు. కనుక ముందు పేచీలు రావటం ఆయనకు ఇష్టం లేదు. మొత్తానికి నిన్ను ఎక్కడైనా మంచి మర్యాదగల చోటనే అమ్మేస్తాడు. యూషనుకి ఈ ఐగుప్తులో ధనవంతులు, కీర్తిపరులు, చాలామంది స్నేహితులు ఉన్నారు" అని కళ్ళు మూసుకొని పండుకున్నాడు వియాన్.

యోసేపు మనసు వికలమైంది. వియాన్ అన్న మాటలు మళ్ళీ ఎడబాటా? ఈ జీవితంలో ఎడబాటనేది మొదలైతే ఇక వరుసగా ఎడబాట్లేనా? తనని అమ్మేయకుండా ఉంటే యజమానికి తన అవసరం ఉండదు. తను కూడా ఆ కూషు దేశస్థుడై పుట్టి ఉంటే మరలా అమ్మివేయబడక పోదును కదా! అనుకున్నాడు. తనని ఎవరో కొనుక్కుంటారు. వారు ఎటువంటివారై యుంటారో తనకు తెలియదు. ఆ ఆలోచన రాగానే భయమేసింది. ఇక్కడ్నుండి పారిపోతే...? అనుకున్నాడు. ఔను పారిపోతే...? తండ్రిని చేరకముందే అన్నలకంట పడితే...? వారి పాపం బయటపడకుండా ఉండటానికి తను చంపివేయబడతాడు. ఒకవేళ వారి కంటబడకుండా తన తండ్రిని కలుసుకుంటే తన అన్నల పాపం బయటపడి వాళ్ళు తన తండ్రి సంస్థానంలో ఉన్న ప్రతి ఒక్కరి దృష్టిలో చచ్చిన వాళ్ళే అవుతారు. అలా ఆలో చిస్తూ ఉంటే తన హృదయం పగిలేలా ఏడవాలని అనిపిం చింది. కాని తను చనిపోతే ఎవరికి లాభం? చనిపోవడం కన్నా బ్రతికి ఉంటేనే మంచిది. మంచైనా, చెడైనా దాన్ని అనుభవించే ముందు దానిని గురించిన ఆలోచన, ముందు ఏం జరుగుతుందోననే ఉత్సాహం బాగానే ఉంది. అయినా

వియాన్‌ని వదిలిపోవాలంటేనే బాధగా ఉంది.

“యోసేపు... యోసేపు...!” వియాన్ లేచి కూర్చుని “అరే ఏమిటి ఏడుస్తున్నావా?” అంటూ దగ్గరకు జరిగాడు.

యోసేపు చిన్నగా నవ్వి కన్నీళ్ళు తుడుచుకొని “అబ్బే, ఏడుస్తున్నానని నాకే తెలీదు” అంటూ “ఇక్కడ కూర్చుని ఉంటే ఏవేవో ఆలోచనలు వస్తున్నాయి. అలా బయటకు వెళ్ళి వద్దామా?” అన్నాడు.

“నువ్వు వెళ్ళిరా!” అన్నాడు వియాన్.

రెండురోజులు గడచిపోయాయి. యూషును గుర్రం మీద బయలుదేరాడు. ఉదయాన్నే డేరా బయట నుండి పిలిచాడు. వియాన్ ఉలిక్కిపడి లేచి బయటకి వచ్చి యజ మానిని చూసి ఆశ్చర్యపోయాడు. కబురు చెయ్యకనే ఆయనే స్వయంగా రావటానికి కారణం ఏమిటి? అని అనుకున్నాడు.

“పోతీఫరు దగ్గర్నుండి సిపాయి వచ్చాడు. ఇంకొక గంటలో రాజుగారి తనిఖీదారు, పన్నుల అధికారి ఈ పూటనే వస్తారట. అందువల్ల మనవాళ్ళందర్నీ ఎక్కడికీ వెళ్ళనివ్వద్దు. రాజుగారి తనిఖీ పూర్తి అయిన తర్వాత ఈ మధ్యాహ్నం నుండి మెంఫిస్ పట్టణానికి ప్రయాణమవుదాం. రాత్రి పొద్దుపోయే లోపలే పట్టణ గవిని చేరుకుంటే మంచిది. రేపు ఉదయం నుండి వ్యాపారం ప్రారంభించవచ్చు. ఔను యోసేపు ఎక్కడ?” అడిగాడు.

“ఇప్పుడే బయటకు వెళ్ళాడు” చెప్పాడు వియాన్ వినయంగా. యూషును గుర్రాన్ని మళ్ళించుకొని వెళ్ళి పోయాడు. తన దుస్తులను మార్చుకొని గుంపుల మనుష్యుల దగ్గరకు వెళ్ళాడు వియాన్.

గుంపులో హడావిడి మొదలైంది. యోసేపు కూడా సిద్ధపడుతున్నాడు. ఇంత మందిలో తనొక్కడే హెబ్రీయుడు. తన తలపాగా కట్టుకున్నాడు. అంగీ సరిపోయినదే కానీ రంగులు లేవు. గడ్డం ఇప్పుడు బాగా కనపడుతూ, తన ముక్కు తనను వెక్కిరించినట్లుగా కనబడింది. అద్దం చూసుకొని ఎంత కాలమైంది! అంటే ఇప్పటికి నలభైరోజుల క్రితం తన ముఖం చూసుకున్నాడు. ఎన్నిసార్లు అద్దం చూసుకున్నా మన ముఖం మనం మర్చిపోతాము కదా! అనుకున్నాడు. నడుముకు దట్టీ కట్టేటప్పుడు అనిపించింది తను సన్నగా అయినట్లుగా. వీళ్ళు ప్రేమగానే చూస్తున్నారు. కాని వీరి ఆహారపు అలవాట్లలో వీరికి రుచికరమైనవి తనకు సహించటం లేదు. ఒంటె మాంసం తనకు అంతగా ఇష్టం కలిగేది కాదు. బయటకు వస్తే ఎదురుగా యూషును నిలబడి ఉన్నాడు. ఆయనని చూడగానే వియాన్ చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. ఎక్కడలేని అభిమానం, గౌరవం కలిగాయి. నేలదాకా వంగి నమస్కారం చేశాడు.

యూషును కొంచెం చలించినట్లుగా కనిపించాడు. తనను తాను సంభాళించు కున్నాడు. అలా కాకపోతే తను సంతోషంగా జీవించలేడు. అదీకాక తనలాంటి దేశదిమ్మరికి డబ్బు ఉంది, పలుకుబడి ఉంది కాని సుఖంలేదు. తను సుఖపడ్డానికి ఒకచోట స్థిరనివాసం చేస్తే సంపాదన ఆగి పోతుంది. ఇంతమందిని ఎలా పోషించాలి? సుఖానికి, డబ్బుకి పొందిక లేదు. సంతోషం కొంటే వచ్చేది కాదు. కాలో, చెయ్యో మూలపడితే కాని తను ఓ చోట స్థిరంగా జీవించలేడు.

**(సశేషం)**

**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా**
**చందా పంపించాలంటే**
**ఈ క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra



# 'స్టుపిడ్, రాస్కెల్'



ఇంట్లో పిల్లలని తల్లిదండ్రులు 'స్టుపిడ్, రాస్కెల్' అని తిడుతుంటారు. మనిషికి వచ్చే కోపాన్నిబట్టి తిట్ల తీవ్రత వుంటుంది. తప్పులు చేసేవాళ్ళు తిట్లు తినాల్సి వస్తుంది. నాగరికత ఉన్నవారైతే సుతిమెత్తనగా తిడతారు, మోటు వాళ్ళు అయితే బండబూతులు తిడతారు. తిట్టు అనేది మనిషి యొక్క కోపాన్ని తెలియజేస్తుంది. బాగా కోపంగా ఉన్న వాళ్ళ ఎదుటికి వెళ్ళాలంటే భయపడతారు. కొంతమంది చాలా సున్నితమైన మనస్తత్వం కలిగినవారు అయితే చిన్న మాట అంటే చాలు ఏదో అఘాయిత్యం చేసుకుంటారు. కఠిన హృదయులు అయితే ఎంత తిట్టినా చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లు తిట్టేది మమ్మల్ని కాదులే అన్నట్లు ఉంటారు. మనమంతా ఇలా చాలా కఠినమైన హృదయం కలిగిన వారమని దేవునితో తిట్లు తినడం ద్వారా రుజువు చేస్తున్నాము. దేవుడు తిట్టడం ఏంటని అనుకుంటున్నారా? 'పాపిష్ఠి జనమా, దోషభరితమైన ప్రజలారా, దుష్ట సంతానమా, చెరుపు చేయు పిల్లలారా మీకు శ్రమ' (యెషయా 1:4) ఇలా బుద్ధిహీనులారా, అవివేకులారా, తెలివిలేనివారలారా అంటే 'స్టుపిడ్' అని, దుష్టులారా, దుర్మార్గురాలా అంటే 'రాస్కెల్' అని, ఇంకా పాపిష్ఠి జనమా, దుష్ట సంతానమా, సర్ప సంతానమా అని ఇలా చాలాసార్లు మనుష్యులను తిట్టడం మనం బైబిల్లో చూడగలము. ఇలా ఎంత తిట్టినా, ఎన్నిసార్లు తిట్టినా చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లు విదిలించుకొనిపోతుంటే మనమెంత కఠిన హృదయులమో కదా! దేవుడు తలుచుకుంటే ఒక్క క్షణంలో మనుష్యులని నాశనం చేయగల శక్తి ఉండి కూడా తిట్లతోనే సరిపెడుతున్నాడు. ఐగుప్తు బానిసత్వం నుండి విడిపించి పాలు తేనెలు ప్రవహించు దేశమైన కనానుకు తీసుకెళ్ళేటప్పుడు అరణ్యంలో ఇశ్రాయేలీయులు దేవున్ని ఎంత విసికించారో, ఎంత క్షోభపెట్టారో 'మీరు లోబడనొల్లని ప్రజలు; ఒక క్షణ మాత్రము నేను మీ నడుమకు వచ్చితినా, మిమ్మును నిర్మూలము చేసెదను' (నిర్గమ.33:5) అని అనేటంత కోపము పుట్టించారంటే వాళ్ళెంత కఠిన హృదయులో, దుర్మార్గులో కదా! దేవుడు మనుష్యులను చాలా ప్రేమిస్తాడు, ఆయన దయామయుడు, నిరంతరం జాలిపడే వాడు, కరుణా హృదయముగల ఆయనకి 'మిమ్మల్ని చంపేస్తాను' అన్నంత కోపం పుట్టించే కఠినులని 'స్టుపిడ్, రాస్కెల్' అంటే వాళ్ళు మాట వింటారా. అందుకే ఐగుప్తులో నుండి బయలుదేరిన వారిలో యెహోషువ, కాలేబు తప్ప మిగతా వాళ్ళంతా అరణ్యంలోనే చచ్చారు. మనమేం తక్కువ తినలేదులేండి, ఇశ్రాయేలీయుల కంటే ఎక్కువగానే దేవునికి కోపం తెప్పిస్తూనే ఉన్నాము. అప్పుడు దేవుడు ఇశ్రాయేలీయులను చంపకుండా మోషే అడ్డుపడ్డాడు. ఇప్పుడు దేవుడు మనల్ని చంపకుండా 'ఈ ఒక్కసారికి క్షమించయ్యా, వాళ్ళు మారడానికి ఇంకొంత మందిని పంపించి వాక్యము చెప్పిస్తాను' అని మన తరపున యేసుప్రభువు అడ్డుపడబట్టే మనం బ్రతికి బట్టకడుతున్నాము. ప్రపంచంలో ప్రతిరోజూ ఎంతోమంది ప్రమాదాల్లో, హత్యలు, ఆత్మహత్యలతో, రోగాలతో చనిపోతున్నారు. ఈ రోజు మనం బ్రతికి ఉన్నామంటే అందుకు కారణం దేవున్ని ఎరుగని వారు దేవున్ని తెలుసుకోవాలని, దేవున్ని తెలుసుకున్నవారు సువార్త ప్రకటించాలని. అలా కానప్పుడు మనల్ని ఈ భూమి మీద ఉంచాల్సిన అవసరం దేవునికి ఏమీ లేదు. ఇశ్రాయేలీయుల్లా మనం కూడా దేవునికి కోపం పుట్టించి 'స్టుపిడ్, రాస్కెల్' అని తిట్టించుకుంటుంటే వారు కనాను దేశంలో ప్రవేశించనట్లే మనకి కూడా 'పరలోకరాజ్య' ప్రవేశం ఉండదు. ఇంక మీ ఇష్టం.

**ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు**

**9 4 4 0 2 1 7 7 2 6**

# నా చిత్తానుసారుడు



(దావీదు జీవిత చరిత్ర)

- కొడవటికంటి

"దావీదునకు ఆమెను ఇస్తానని మాట ఇచ్చాను కదా!" అన్నాడు.

"దావీదుకు మేరబు మీద మనసు లేదు" అన్నది.

"ఏమి? ఎందుకు? ఆమె రాజు కుమార్తె కాదా! అమె అందగత్తె కాదా?" అన్నాడు సౌలు ఆలోచిస్తూ.

"దావీదు మీకాలును ప్రేమిస్తున్నాడు. ఆమె కూడా అంతే" అన్నది చిన్నగా.

ఇది క్రొత్త విషయం. మీకాలు ప్రేమించటమేమిటి? అనుకొన్నాడు. ఆమెను తనును తాను తప్ప మరొకరిని ప్రేమించదు. తన మాట తప్పితే ఇతరుల మాట తీసుకొనదు. భూమి కృంగినా తన పట్టు వదలదు అనుకుంటూనే పెద్దగా నవ్వాడు.

అహీనోయము తన భర్తవైపు ఆశ్చర్యంగా చూచింది.

ఇంత ముఖ్యమైన విషయాన్ని సౌలు అంత తేలికగా తీసుకోవడం ఆమెకి అర్థం కాలేదు.

"మీకాలు దావీదునకు ఉరిగా ఉండును. ఫిలిష్తీయుల చెయ్యి అతని మీద పడును" అని గంభీరంగా కూర్చున్నాడు.

అహీనోయముకు సంగతి అర్థం కాకపోయినా తాను ఎంతకాలంగానో భర్తకి చెప్పటానికి సంకోచించిన విషయం తేలికగా సమసిపోయినందుకు ఆమె సంతోషించింది.

పెండ్లి జరిగిపోయింది. హడావుడి అంతా సద్దుమణిగిన తరువాత సౌలు నిశ్చింతగా ఉన్నాడు. ఎప్పుడు ఫిలిష్తీయులతో యుద్ధం జరిగినా తన భార్య కుమార్తెల విషయం తనకు భయంగా ఉండేది. ఇశ్రాయేలు మొదటి రాజు కుటుంబం చెదరిపోకుండా దేవుడు కాపాడతాడని నమ్మకం ఉన్నా మానవ బలహీనత, ఏవో ఆలోచనలు.

ఇప్పుడు మీకాలు విషయం ఆలోచించటం మొదలు పెట్టాడు. అసలు మీకాలులో ప్రేమించే భావన ఉన్నాదా? అని ఆశ్చర్యపడేవాడు. కాని మీకాలుని ప్రత్యేకంగా గమనిస్తుంటే మీకాలువలె ప్రేమించ గలిగిన కన్యలు కూడా ఉన్నారా? అనిపిస్తుంది. ప్రియుని మీద ప్రేమ వేరు, నిజ జీవితం సహజ సిద్ధమైన ఇతరులను బాధించే గుణాలు వేరు.

అవి ఇవి సమయానుకూలంగా జీవితాలలో పనిచేస్తుంటాయి. మీకాలులోని సహజసిద్ధమైన గర్వం, అహంకారం ఏదో ఒకరోజు దావీదు గొఱ్ఱెల దొడ్డిలో నుండి వచ్చినవాడే కదా అనే హీనమైన భావన ఆమెలో ఉండి అతని జీవితంలో నెమ్మది లేకుండా అతనికి ఉరిగా ఉంటుందని సౌలుకు తెలుసు.

వివాహం కాకముందే దావీదు చనిపోతే మరీ మంచిది అనుకొన్నాడు. ఒకరోజు దావీదునకు వర్తమానం పంపించాడు. తన గృహములోనే తన ప్రత్యేక గదిలో కూర్చుని ఉన్నాడు.

దావీదు ఇప్పుడు బాగా ఎదిగిపోయాడు. సహస్రాధిపతి ఠీవి అతనికి తెలియకుండానే అతనిలో ప్రవేశించింది. సహస్రాధిపతి చేసే అభివందనం చేశాడు.

"ఇప్పుడు నీవు మరియొక దానిచేత నీవు నాకు అల్లుడవు అవుతున్నావు" అని అన్నాడు. దావీదు ఏమీ మాట్లాడలేదు. కొంచెంసేపు తలవంచి అలానే నిలుచున్నాడు.

దావీదు మనస్సులోని అభిప్రాయం సౌలుకు అర్థం కాలేదు. బలవంతంగా అతని అభిప్రాయం తెలుసుకోవటం కష్టం. అది అంత మంచిదికాదు. కొంచెంసేపు ఆగి "ఇక వెళ్ళవచ్చును" అన్నాడు చాలా సౌమ్యంగా.

దావీదు నిదానంగా బయటకి వచ్చి పూదోట ప్రక్కనున్న అంతస్తు కిటికీ వైపు చూచాడు మీకాలు కనిపిస్తుందని. కాని కనిపించలేదు. మనస్సు కొంచెం బాధగా ఉంది. ఆమెని తను తలంచుకొని కలవలేదు. కాని మీకాలు ఎప్పుడు తలచుకొంటే అప్పుడు తనతో మాట్లాడగలదు. ఆమె ఎవరికి భయపడదు.

తన నివాసం వద్దకు వచ్చాడు. బయట వరండాలో

మీకాలు చెలికత్తె విన్ని కనిపించింది. కబురు ఏమై ఉంటుందా అనుకొంటూ ప్రహరి దాటగానే విన్ని లేచి నిలుచుంది. ఏమి మాట్లాడకుండా మౌనంగా ఉన్నది. ఎప్పుడైనా తన దగ్గరకు రాగానే ఒక మాటచెప్పి చెప్పగానే వెళ్ళిపోతుంది. ఈరోజు ఏమైంది.

"విన్ని" అన్నాడు.

"ఆ" అని ఇంటిలోపల చూచింది.

దావీదు లోపలకి చూచాడు. ఏమి కనిపించలేదు. లోనికి వెళ్ళాడు. ప్రక్కగదిలో మీకాలు వుంది. గుండె ఆగినట్లయింది.

"మీకాలు" అన్నాడు.

"మీరెక్కడికెళ్లారు" అంది చిరుకోపంతో.

"నీకు తెలియదా?" అని "మీ తండ్రిగారు పిలిపించారు. మాట్లాడి బయటకు వచ్చేటప్పుడు కిటికివైపు చూచాను నిరాశ. కాని ఇక్కడ ఆశ్చర్యం కలిగించావు" అన్నాడు. అతని గుండె వేగంగా కొట్టుకొంటుంది. ఆమె ఏమి చేసినా అడిగే వారు లేరు కాని తాను ప్రస్తుతం సహస్రాధిపతి మాత్రమే.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అంటూ దగ్గరగా వచ్చి తన కళ్ళలోకి చూస్తుంది చిరునవ్వుతో.

తన గుండె శబ్దం ఆమెకు వినబడుతుందేమో అని సిగ్గువేసింది.

"నిన్ను నాకిచ్చి పెండ్లిచేస్తానని చెప్పారు" అన్నాడు.

"ఆ సంగతి రాత్రి మా అమ్మ చెప్పింది. ఆ విషయం నీతో చెబుదామని వచ్చాను ఇక వెళ్తాను" అని నవ్వుతూ బయటికి వచ్చి విన్ని చెయ్యి పట్టుకొని వెళ్ళింది.

హమ్మయ్య అనుకొన్నాడు. మీకాలు ప్రవర్తనలో, వయస్సులో వెకిలితనం కొంచెమైనా లేదు అనుకొన్నాడు.

మధ్యాహ్నం భోజన సమయానికి ముందుగా కొనన్యా, అతని పనివారిలో ఇంక ఇద్దరు ముఖ్యులు దావీదు దర్శనం కొరకు వచ్చారు. వచ్చినవారు సౌలు రాజుగారికి ఇష్టమైన పనివారు అని దావీదుకు తెలుసు. కుశల ప్రశ్నలు అయిన తర్వాత కొనన్యా ఒక్కడే దావీదుతో కలిసి లోనికి వచ్చాడు. రహస్యం చెబుతున్న వానివలె దగ్గరగా వచ్చి–

"రాజు మీ యందు ఇష్టము కలిగియున్నాడు. అతని సేవకులందరు నీ యెడల స్నేహంగా ఉన్నారు కాబట్టి నీవు రాజునకు అల్లుడవు కావలెను" అన్నాడు.

దావీదు ముఖంలో వెలుగు ప్రకాశించినా అది కనబడ నీయకుండా "నేను దరిద్రుడనై ఎన్నిక లేనివాడనైయుండగా రాజునకు అల్లుడనగుట స్వల్ప విషయమని మీకు తోచునా?" అన్నాడు.

కొనన్య అంటే దావీదుకు అంత గౌరవం లేదు. ఏదైనా యధార్థ విషయాలకు షేలహును ఉపయోగించినట్లుగా రాజు కొనన్యాని అవాస్త విషయాలకు వాడతాడు.

"రాజు ఓలిని కోరక రాజు శత్రువుల మీద పగ తీర్చు కోవలెనని ఫిలిష్తీయుల నూరు ముందోళ్ళు కోరుచున్నాడు" అని చిన్నగా చెవిలో చెప్పినట్లుగా చెప్పాడు.

కొనన్యా ముఖం చూచినప్పుడు రాజు యొక్క ఉద్దేశం దావీదుకు పూర్తిగా అర్థమైంది. యుద్ధసమయంలో కాక సమాధాన సమయంలో ఫిలిష్తీయుల నూరు ముందోళ్ళు తేవటం అంటే నూరుగురిని చంపి, చచ్చిన ఫిలిష్తీయులకు సున్నతి చేయడం అన్నమాట. ఈ విషయం చాలా ద్రోహ కార్యంగా తోచినది. నూరు ముందోళ్ళు తెచ్చే ప్రయత్నంలో తాను మరణించటం కూడా సౌలు యొక్క ఉద్దేశమై ఉండ వచ్చును. ఏదైనా ఇది తన పరాక్రమమునకు పరీక్ష అయినా, తన యధార్థతకు యెహోవా తనను విడిచియున్నాడని సౌలు మరలా తెలుసుకొనటానికి అతనికి ఇది ఒక అవకాశం.

ఫిలిష్తీయుల ముందోళ్ళకై రాజు నియమించిన గడువు చాలా ఉంది. మీకాలు గుర్తుకు వచ్చింది. రాజు మనస్సు ఒకరోజు ఉన్నట్లుగా ఇంకోరోజు ఉండదు. వెంటనే తన నౌకరు యేషెరును పిలిచి సాయంకాలం లోపల అబీషైని కోటకి రమ్మని చెప్పాడు.

అబీషై వస్తూనే తన వెంట బేత్లెహేము బావినీళ్ళ తిత్తి తీసికొని వచ్చాడు. తన అభిరుచులు ఆశయాలు అబీషై ఎరిగినట్లు ఎవరూ ఎరుగరు అనుకొన్నాడు. తన మిత్రులతో తన ఇంట్లోనే భోజనం చేస్తున్నట్లుగా రాజసముఖమునకు కబురు చేసాడు. **(సశేషం)**

స్త్రీల విభాగం

# ప్రిస్కిల్ల

హన్నాకృప పాఠకులకు యేసుక్రీస్తు నామంలో శుభములు. మొదటి శతాబ్దపు కాలంలోని ఆది సంఘంలో ఉన్నా ఒక నిజ క్రైస్తవురాలైన ప్రిస్కిల్ల గురించి తెలుసుకుందాం.

ప్రిస్కిల్ల గురించి మొదటిగా అపో.కా. 18వ అధ్యాయంలో వ్రాయబడింది. పౌలు తన సువార్త దండ యాత్రలలో భాగంగా కొరింథు పట్టణంలో సువార్త ప్రకటిస్తున్నప్పుడు అకుల ప్రిస్కిల్లను కలుసుకున్నాడు.

అకులతన భార్యయైన ప్రిస్కిల్లతో రోమ్ నగరంలో నివసిస్తున్న యూదుడు. వీరద్దరూ యేసును స్వంతం రక్షకుని అంగీకరించిన క్రైస్తవులలో ముఖ్యులు. అకుల ప్రిస్కిల్లలు యేసును గూర్చి ఎలా విని ఉంటారు? రోమ్ నగరం యెరూషలేముకు దాదాపు 4000 కి.మీ దూరం. ఆ కాలంలో ప్రయాణ సౌకర్యాలు కూడ సరిగా లేనందున ప్రయాణాలు అంత తరచుగా జరిగేవి కావు. కేవలం అత్యవసర, తప్పనిసరి సందర్భాలలోనే ప్రయా ణాలు జరిగేవి కాబట్టి ఈ భార్యభర్తలు యేసును గురించి ఎలా విని ఉంటారు?

యేసు యూదా, ఇశ్రాయేలీయుల దేశాలు దాని పరిసర ప్రాంతాలలో ఉన్న దేశాలలోనే సువార్త ప్రకటించాడు. కానీ రోమ్‌లో ఉన్న అకుల, ప్రిస్కిల్లలు యేసును గురించి వినుట ఎంత మేరకు సాధ్యము? యేసును గూర్చి వినిన వారు, యేసును ఎరిగిన వారెవరైనా రోమ్‌లో యేసును గూర్చి చెప్పి ఉండవచ్చు. కానీ అకుల ప్రిస్కిల్లల భక్తి కేవలం యేసు గురించి వినినందు వలన కలిగినది మాత్రమే గాక వ్యక్తిగతంగా ఎరిగిన వారి విశ్వాసమువలె కనబడుచున్నది. ఎందుకంటే స్వయంగా పౌలు అకుల ప్రిస్కిల్లలను క్రీస్తు పనిలో నా జతపనివారు అని సంబోధించాడు. అంటే వారి విశ్వాసం చాలా బలమైనది. బహుశా అకుల యూదుడు కాబట్టి అతను తన భార్యయైన ప్రిస్కిల్లతో కలసి పస్కా పండుగకు యెరూషలేమునకు వచ్చి ఉండవచ్చు. లేదా బంధువుల ఇళ్ళకు లేదా ఏదైనా సందర్భాలలో యెరూషలేము వచ్చినప్పుడు యేసు గురించి విని ఉండవచ్చు. ధర్మశాస్త్రమును ఎరిగిన యూదుడు కాబట్టి యేసే మెస్సీయ అని గ్రహించి ఉండవచ్చు.

భర్తతో కలసి యేసును ఎరిగిన ప్రిస్కిల్ల వ్యక్తిగతంగా యేసును తన సొంత రక్షకునిగా అంగీకరించింది. అందుకే క్రీస్తును వెంబడించుట నేరంగా పరిగణించి క్రీస్తు శిష్యులను చెరసాలలో వేయుట, హింసించుట ఆ కాలంలో సర్వ సాధారణం. ఒక్కోసారి ఆ శ్రమ మరణమైన కావొచ్చు ఇదంతా ఎరిగియుండియు క్రీస్తును స్వంత రక్షకునిగా అంగీకరించిన ధైర్యవంతురాలైన స్త్రీ ప్రిస్కిల్ల.

ప్రిస్కిల్ల మంచి భార్య. సామాజిక పరిస్థితులకు భిన్నంగా అకుల క్రీస్తును వెంబడించుటకు నిర్ణయం తీసుకున్నప్పుడు ఆమె అతని నిర్ణయాన్ని స్వాగతించింది. ఆనాటి పరిస్థితులలో ఉన్న శ్రమలకు భయపడక అతని నిర్ణయాన్ని ధృఢపరచింది. రోమా నుండి యూదులు వెళ్ళిపోవాలని ఆజ్ఞ జారి చేయబడినప్పుడు దగ్గరగా ఉన్న కొరింథు పట్టణానికి చేరి తమ జీవనం కొనసాగిస్తున్న భార్యభర్తలు వీరు. అకుల ప్రిస్కిల్లలు డేరాలు కుట్టు వృత్తి కలవారు. ఆ కాలంలో డేరాల కుట్టుట మంచి లాభధాయకమైన వృత్తి. అయితే దానికి చాలా నైపుణ్యత కావాలి. జంతు చర్మాన్ని మనకు కావాలసిన ఆకారంలోకి మలచటం అంత సులువైన పని కాదు. చర్మాన్ని శుభ్రపరచడం, ఎండబెట్టడం, వాటిని సరైన ఆకారంలో కత్తిరించడం, కుట్టడం చాలా పెద్ద పని. అటువంటి పనిలో అకులకు మంచి సహాయకారిగా ఉన్నది.

పౌలు కొరింథుకు వచ్చినప్పుడు అకుల ప్రిస్కిల్లతో కలసి డేరాలు కుట్టే పనిచేస్తూ అక్కడ సువార్త ప్రకటించాడు. ప్రిస్కిల్ల పౌలు బోధలను చక్కగా గ్రహించింది. యేసుక్రీస్తు మాటలు వినుటకు ఆసక్తి చూపింది. విశ్వాసం లోతు పాతులను గ్రహించింది. సువార్త పనిలో పాలిభాగస్తురాలైంది. తన భర్త

ద్వారానో, వ్యక్తిగతంగానో తాను వినిన విషయాలనుబట్టి యేసును నమ్మి సొంత రక్షకునిగా అంగీకరించినను అంతటితో సరిపెట్టుకోలేదు. దేవుని పట్ల ఉన్న ఆసక్తితో ఆమె తన విశ్వాసాన్ని పెంపొందించుకుంది. పౌలు ద్వారా దేవుని తెలుసుకొనుటకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న యుక్తిపరురాలు ప్రిస్కిల్ల.

పౌలుతో కలిసి కెంక్రేయ, సిరియా ప్రయాణం చేశారు అకుల ప్రిస్కిల్ల. ఆ ప్రయాణంలో సువార్త ప్రకటించడం ముఖ్య భాగం. దేవుని పనిని చేయుటకు, దేవుని పని చేయువారికి సహాయపడుటలో ముందున్న కష్టజీవి ప్రిస్కిల్ల.

అపొల్లో అను యూదుడు లేఖనములలో విద్వాంసుడై ఉండి సువార్త ప్రకటించుటకు ఆసక్తి కలిగి ఎఫెసుకు వచ్చినప్పుడు అకుల ప్రిస్కిల్లలు అపొల్లోను చేర్చుకొని దేవుని మార్గమును పూర్తిగా విశదపరచి అతనిని చేర్చుకొమ్మని అకయ అనే ఊరిలోని శిష్యులకు ఉత్తరం వ్రాశారు. అపొల్లో యేసే క్రీస్తని బహిరంగంగా ప్రకటించి అనేకులను క్రీస్తు శిష్యులుగా మార్చాడు.

అపొల్లో విద్వాంసుడు. అతనికి వాక్యము, విశ్వాసపు లోతులను చెప్పే స్థాయిలో ఉన్నది ప్రిస్కిల్ల భక్తి జీవితం. ఆమె నేర్చుకొనిన, తెలుసుకొనిన సంగతులను ధ్యానం చేసింది, అభ్యాసం చేసింది అందుకే లేఖనములందు విద్వాంసుడైన వానికి సైతం బోధించగలిగింది. అంతేకాదు సంఘములో మంచి సాక్ష్యము కలిగి ఉన్నది. అందుకే ఆమె అకయ వారికి అపొల్లోను చేర్చుకొమ్మని ఉత్తరం వ్రాయగలిగింది. అంతేకాదు అకయ వారు ప్రిస్కిల్ల మాటను అంగీకరించి అపొల్లోను చేర్చుకున్నారు. అంటే ప్రిస్కిల్ల సాక్ష్యము ఎటువంటిదో మనకు అర్థమౌతుంది.

శ్రమలు మనకు ఎదురౌతాయని తెలిస్తే మనం యేసును స్వంత రక్షకునిగా అంగీకరించడానికి ధైర్యం చేస్తామా? అన్ని విధాల అనుకూలంగా ఉన్న ఈ రోజుల్లోనే దేవున్ని నమ్మని నామకార్థ క్రైస్తవ జీవితం జీవిస్తు, చిన్నచిన్న శ్రమలను కూడ సహించుకొనక దేవున్ని నిందిస్తూ బ్రతుకుతున్న నేటి క్రైస్తవ మహిళా సమాజం ప్రిస్కిల్లను చూసి శ్రమలను లెక్క చేయక, యేసునందే గురి కలిగి ధైర్యంగా క్రీస్తును వెంబడించుట నేర్చుకోవాలి.

యేసును తెలుసుకొనుట, విశ్వసించుట, సొంత రక్షకునిగా అంగీకరించుట, దేవుని తెలుసుకొనుటకు ఆసక్తి కలిగి ఉండుట, విశ్వాసాన్ని పెంపొందించుకొనుట క్రమక్రమంగా, సువార్త పనిని కొనసాగించుట, సువార్తికులకు సహకరించుట వంటి అనేక మెట్లను ఎక్కుతూ పరిపూర్ణమైన క్రైస్తవురాలైన ప్రిస్కిల్ల జీవితాన్ని ధ్యానించిన తరువాత అయినా నేటి క్రైస్తవ స్త్రీలు తమ విశ్వాస జీవితాన్ని పరిశీలించుకొనవలసిన అవసరం ఎంతో ఉన్నది. ఎన్నో సంవత్సరాలుగా దేవుని వాక్యం వింటూ, ఎటువంటి ఎదుగుదల లేని విశ్వాసస్థాయి కలిగి ఉండే క్రైస్తవ స్త్రీలు ప్రిస్కిల్ల జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి దేవునికి సమయాన్ని కేటాయించి తమ విశ్వాస జీవితాన్ని మార్చు కోవాలి.

ప్రిస్కిల్ల మంచి భార్యగా, తన భర్తకు సాటియైన సహాయ కారిగా ఉన్నది. కుటుంబ విషయాలలోను, ఆర్థికపరమైన విషయాలలోను, విశ్వాస జీవితంలోను, సంఘంలోను అన్ని కోణాలలో నిజమైన గృహిణిగా ఉన్నది. స్త్రీగా అనేక పాత్రలు ఏకకాలంలో పోషించవలసి వచ్చినప్పుడు కొన్ని ఒడిదుడు కులు కలగవచ్చు అయితే వాటిని ఎదుర్కొని నిలబడాలి అంటే అటువంటి పరిస్థితులను మార్చగల వాని మీద ఆధారపడాలి. ఆయన మాటను అనుసరించాలి.

ప్రిస్కిల్లకు ఉన్న దేవుడు ఈ రోజు నీకు ఉన్నాడు. ప్రిస్కిల్ల జీవితాన్ని అన్ని విధాల పరిపూర్ణంగా మార్చిన దేవుడు నీ జీవితాన్ని పరిపూర్ణ క్రైస్తవ జీవితంగా మార్చగలడు. అయితే ప్రిస్కిల్ల కనబరిచిన ఆసక్తి, శ్రమలను సైతం లెక్కచేయని ధైర్యం, దేవుని కొరకు జీవించాలనే ధృఢసంకల్పం నీకు ఉండాలి. అప్పుడు దేవుడు నీ పక్షానా ఉండి, నీ జీవితాన్ని జయకరంగా మారుస్తాడు.

# యేసు పలుకులు

మన దైనందిన జీవితంలో ప్రొద్దున లేచినప్పటి నుండి రాత్రి పడుకునే వరకు ఎన్నో మాటాలు వింటుంటాం, అంటుంటాం. అయితే అవన్ని లోకవార్తలు అవి కేవలం సమయాన్ని వృథా చేయడానికి తప్ప మన జీవితాలను మార్చవు, మార్చుకొనుటకు ఉపయోగపడవు. జీవితాలను మార్చగల శక్తిగల మాటలు యేసు మాటలు. ఎందుకంటే యేసు మనతో సహానుభవము గలవాడైయుండి మనవలె కాక పరిశుద్ధమైన జీవితాన్ని జీవించి మృత్యుంజయుడైనాడు. ఈ భూమ్మీద ఆయన జీవితం, జీవనశైలి, ఆలోచన సరళిని మనం ధ్యానించి వాటిని అనుసరించుటకు ప్రయత్నించుట ద్వారా మన జీవితాలను సరియైన దారిలో నడిపించగల ఆధారాన్ని చేరి, నిజ ఆత్మస్థైర్యాన్ని కలిగి ఈ లోకానికి ఎదురీదుతూ సత్యమార్గాన్ని అనుసరించుటకు వీలు కలుగుతుంది.

యేసు ఈ భూమ్మీద జీవించిన ముప్పైమూడున్నర సంవత్సరాల కాలంలో యేసు మాట్లాడిన మొదటి మాటలుగా నమోదు చేయబడినవి యేసు పండ్రెండేళ్ళ వయస్సులో పస్కా పండుగ నిమిత్తం యెరూషలేము వెళ్ళి తిరిగి తన తల్లిదండ్రు లతో వెళ్ళక దేవాలయంలో ఉన్న సందర్భంలోని మాటలు. లూకా 2:41-49 వాక్యభాగంలో యేసు దేవాలయంలో యాజకులతో ధర్మశాస్త్రమును గూర్చి సందేహాలను అడిగి తన పాండిత్యంతో వారిని అబ్బురపరచినట్లు వ్రాయబడినను యేసు తన తల్లిదండ్రులతో '-మీరేల నన్ను వెదకుచుంటిరి? నేను నా తండ్రి పనుల మీద నుండవలెనని మీరెరుగరా?' అను యేసు పలుకులు లిఖితములైన మొదటి మాటలుగా పరిగణించి నట్లయితే ఈ సంచికలో మన ధ్యానభాగం ఆ పలుకులే.

యూదులు తమ ఆచారం ప్రకారం ఐదు సంవత్సరాల వయస్సు నుండే పిల్లలకు ధర్మశాస్త్రమును నేర్పిస్తారు. పరి శుద్ధ గ్రంథములోని మొదటి ఐదుగ్రంథాలైన పంచ కాండము లను కంఠత చేయిస్తారు. యూదులు తమ దైనందిన జీవితంలో ధర్మశాస్త్రమును అనుసరించాలి కాబట్టి ప్రతి యూదుడు ధర్మశాస్త్రాన్ని బాల్యంలోనే కంఠస్థం చేస్తారు.

యేసుప్రభువు కూడా యూదుడే కాబట్టి ఆచారం ప్రకారం బాల్యం నుండి ధర్మశాస్త్రమును నేర్చుకొని ఉంటాడు. యేసు జన్మము పరిశుద్ధముగా జరిగినదే తప్ప అతను కూడా అందరి మానవులవలె ఈ భూమ్మీద జీవించాడు. మరీ ముఖ్యంగా బాల్యంలో. యేసు కూడా సామాన్య బాలుడే. యూదుడు కాబట్టి యేసు జీవితంలో బాల్యంలోనే దేవుని స్పృహ ఉన్నది. పన్నెండేళ్ళు వచ్చేసరికి దాదాపుగా ఐదు కాండాలు నేర్చుకొని ఉంటాడు. అయితే యేసు యూదులందరివలె కేవలం ఆచారం నిమిత్తం ధర్మశాస్త్రమును నేర్చుకొనక ఆసక్తితో ధర్మశాస్త్రమును నేర్చుకొని ఉండవచ్చు. అందుకే యేసు ధర్మశాస్త్రపు చుట్టలో ఉన్నది కంఠత చేయడమే కాక ధర్మశాస్త్రములో లిఖింపబడిన ఆజ్ఞలు, కట్టడలు వెనుక దేవుని ఉద్దేశం ఏమైఉంటుందో అని పరిశీలనాత్మకంగా ఆలోచిస్తూ నేర్చుకున్నాడు. అందుకే యేసు దేవాలయంలోని యాజకులు సైతం ఆలోచించని కోణంలో ఆలోచించి ప్రశ్నించ గలిగాడు. దీంట్లో దైవికమైన శక్తివంతిది ఏమి లేదు కేవలం యేసుకు దేవునిపై ఉన్న ఆసక్తి ప్రేమ, ధర్మశాస్త్రమును ఆయన అర్థం చేసుకున్న తీరు దేవాలయంలోని యాజకులను ఆశ్చర్య పరచింది.

యేసును వెతుక్కుంటూ తిరిగి వచ్చిన మరియ – 'కుమారుడా మమ్మును ఎందుకీలాగు చేసితివి? ఇదిగో నీ తండ్రియు నేనును దుఃఖపడుచు నిన్ను వెదుకుచుంటిమి' అని చెప్పగా యేసు '-మీరేల నన్ను వెదకుచుంటిరి? నేను నా తండ్రి పని మీద ఉండవలెనని మీరెరుగరా?' అని పలికాడు.

'మీరేల నన్ను వెదకుచుంటిరి?' అనే మాటను పరిశీలించి నటయితే నన్ను వెదకడం దేనికి నేను దేవాలయంలో ఉంటానని మీకు తెలియదా? నా గురించి మీకు తెలియదా? నేను ఎప్పుడైనా అల్లరి చిల్లరిగా తిరిగానా? అని తన తల్లిని అడుగుతున్నట్లు ఉంది. తన ప్రవర్తన ఎంత సరియైనదిగా ఉండినదో ఆ మాట అడుగుటలో అర్థమౌతుంది. యేసుకు

ఇంటిలో మంచి సాక్ష్యమున్నది అనవచ్చు.

యేసుకి పన్నెండేళ్ళ వయసుకే దేవుని ప్రేమ అర్థమవ్వడమే కాక తన పుట్టుక యొక్క ఉద్దేశం కూడ అర్థమైంది. తన జీవిత ఉద్దేశం దేవుని పని చేయడమే అని తెలుసుకున్నాడు. దేవుని పని చేయడం అంటే మొదటిగా దేవున్ని పూర్తిగా తెలుసుకొనుట. యేసు దేవకుమారుడని ఆయనకు ఆయన జీవిత ఉద్దేశం ముందుగానే తెలుసు అని పూర్తిగా అనుకోలేము. ఎందుకంటే ఆ వయసు సహజంగా పిల్లలు ఆటలాడుకునే వయసు. కాకపోతే చిన్ననాటి నుండి దేవుని గురించిన తలంపులతో, ఆలోచనలతో పెరగడం వలన తన జీవిత ఉద్దేశం దేవుని పని అని అతి చిన్న వయసులోనే తెలుసుకోగలిగాడు.

దేవుడు ఇశ్రాయేలీయులను ఐగుప్తు నుండి కనాను తీసుకెళ్ళే మార్గంలో అనేక అద్భుతాలు చేశాడు. తన శక్తిని తన మహిమను వారికి చూపించాడు అయితే ఇశ్రాయేలీయులు దేవుని ప్రేమను గుర్తించక అరణ్యంలో ఎదురయ్యే సమస్యలనుబట్టి దేవున్ని అనేకమార్లు తృణీకరించారు. ఫలితంగా దేవుని ఉగ్రతను చవిచూశారు. అయితే దేవుడు అనేకమార్లు మోషే ద్వారా తన ప్రేమను తెలియజేశాడు. ఆ ప్రేమ ఇశ్రాయేలీయులకు అర్థం కాలేదు. కానీ ఆ పంచ గ్రంథంలో ఉన్న దేవుని ప్రేమ యేసుకు అర్థమైంది. అందుకే ఎంతో ధైర్యంగా ఆత్మవిశ్వాసంతో "నా తండ్రి" అని సంబోధిస్తున్నాడు. కేవలం దేవుని ప్రేమను వ్యక్తిగతంగా ఎరిగిన వారు మాత్రమే ఆయనను తండ్రి అని హృదయపూర్వకంగా సంబోధించగలరు. ఇంకా చెప్పాలంటే యూదులు దేవుని నామాన్ని చాలా గౌరవిస్తారు. యెహోవా నామమును వ్యర్థముగా ఉచ్ఛరింపకూడదు అనే ఆజ్ఞ ప్రకారం దేవున్ని తండ్రి అని చెప్పడం అది ఆ వయస్సులో అంటే యేసు సామాజిక యూదా మత ఆచార ప్రభావం లేని నిష్కల్మష హృదయంతో ధర్మశాస్త్రమును పఠించాడు అని చెప్పవచ్చు అందుకే యేసుకు దేవుని ప్రేమతత్వం అవలీలగా బోధపడింది.

ఏ విషయమునైనా అందరివలెకాక అన్ని కోణాలలో ఆలోచించేవారు చాలా ప్రత్యేకంగా ఉంటారు. యూదులందరూ ధర్మశాస్త్రమును నేర్చుకున్నప్పటికి యేసు ధర్మశాస్త్రమును అర్థం చేసుకునే విధానం వేరుగా ఉంది. అందుకే అతని పాండిత్యము అందరిని అబ్బుర పరచింది. ఈనాడు సరిగ్గా ఆ వయసు క్రైస్తవ పిల్లలు ఎలా ఉంటున్నారు? క్రీస్తును ఎరిగిన కుటుంబాలలో పుట్టినప్పటికి వారికి దేవుని స్పృహ ఉంటున్నదా? దేవునిపట్ల బైబిల్‌పట్ల వారి ఆసక్తి పెంపొందించుట క్రైస్తవ తల్లిదండ్రుల బాధ్యత. అంతేకాదు యేసువలె పిల్లలు బాల్యములోనే మంచి సాక్ష్యమును కలిగి ఉన్నారా? చాలామంది పిల్లలు చదువులో మంచిగా రాణించినప్పటికి వారి ప్రవర్తన ఇంట్లో సరిగా ఉండదు. చిన్నబిడ్డలను మంచి ప్రవర్తన కలిగి ఉండునట్లు ప్రార్థన పూర్వకంగా తల్లిదండ్రులు తమ వంతు ప్రయత్నం చేయాలి. దేవుని గురించి తెలుసుకొను ఆసక్తి పిల్లలలో పెంపొందించాలి.

సాధారణంగా క్రైస్తవులు లూకా 2:41-49 కేవలం యేసు కొరకు వ్రాయబడినట్లు ఆలోచిస్తుంటారు. కానీ అది కేవలం యేసు కొరకు వ్రాయబడలేదు. యేసు దైవకుమారుడు, ఎన్నుకోబడినవాడు, కారణజన్ముడు కాబట్టి యేసు బాల్యం అలా లేదు. యేసు బాల్యం ప్రత్యేకంగా ఉంది కాబట్టి దేవుడు యేసును "ఈయన నా ప్రియ కుమారుడు" అన్నాడు.

పన్నెండేళ్ళ వయస్సులో యేసుకు సాధ్యమైన క్రమశిక్షణ ఈనాటి క్రీస్తు బిడ్డలకు ఆదర్శం. చిన్నతనం నుండి దేవుని భయం, కాపుదల, ప్రేమలో ఎదిగే బిడ్డల భవిష్యత్తు దేవుని ప్రణాళికలో ఉంటుంది. కాబట్టి క్రీస్తును ఎరిగిన మనం మన బిడ్డలను యేసులో పెంచుదాం!

## గమనిక

పాఠకుల నుండి కవితలు, కథలు కోరబడుచున్నవి. ఉత్తమ కవితలు, కథలకు బహుమతి కూడా ఉంటుంది. ఒక ఠావు (రెండువైపులా) మించకుండా వ్రాసి 20వ తేది లోపు మాకు చేరేలా పంపించండి. లేదా స్కానింగ్ చేసి మా ఈ-మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.
kerajendra@gmail.com

**సాక్ష్యము**

# కరపత్రము

నా బాల్యంలోనే యేసుక్రీస్తును గూర్చిన మొదటి బహిరంగ పరిచయం కలిగింది. అనామక కరపత్రం క్రీస్తును అందించింది. హిందూ మత పూజలలో మా కుటుంబం నిమగ్నమై పోయేది. ఆంధ్రప్రదేశ్‌లోని ఒక మారుమూల గ్రామం మాది.

క్రీస్తు విశ్వాసి ఒక మిషెనరీ బోధకుడు మా గ్రామంలో కరపత్రాలు పంచేవారు. దైవికంగా నేనొక కరపత్రాన్నందుకొని చదివాను. ఆ కరపత్రాలలో యేసుక్రీస్తును గూర్చి చదివి ప్రభావితుడనయ్యాను. యోహాను 8:1-11 పాఠ్యభాగంలో వ్యభిచారంతో పట్టబడిన స్త్రీ పట్ల క్రీస్తు చూపిన ప్రేమ వైఖరి నా హృదయాంతరంగాల్ని స్పర్శించి దయ జాలితో చలింపజేసి నన్ను కదిలించింది. హిందూమత శాస్త్రాల దృష్ట్యా ఎవరి ఖర్మకు వారే బాధ్యత వహించాలని ఉంది. ఈ సందర్భములో క్రీస్తయితే ఆమె పాపాలను సంపూర్ణముగా క్షమించడమే కాక, 'ఇకను పాపము చేయకుము' అని అప్యాయంగా చెప్పి పంపారు. ఈ ఒక్క సంఘటన, ఆ క్రీస్తు చూపిన జాలి కరుణనుబట్టి ఆ క్రీస్తు నాకు హీరో అనుకరించదగిన రోల్ మోడల్. గొప్పవ్యక్తిగా నా హృదయంలో యేసుపట్ల గౌరవ ప్రవృత్తిని పెంచింది. ఆ క్రీస్తే నా దేవుడు కావాలని ధృడంగా భావించాను.

నా కనుచూపు మేర ఒక క్రైస్తవుడుగాని చర్చిగాని కనిపించదు. అందువల్ల హిందూ సదాచార సంస్కృతిలో యేసుచరిత్ర ఒక చిన్న బాగమైనట్లు భావించాను. మా గ్రామాన్ని వదిలిపెట్టి నేను డిగ్రీ చదువుకై హైదరాబాద్ చేరేవరకు యేసుక్రీస్తు క్రైస్తవుల మత గురువని నాకు తెలియలేదు. నేను చదివే విశ్వ విద్యాలయంలో బోధనా విధానం ఇంగ్లీషుభాషలో ఉండేది. నా చదువంతా తెలుగు మీడియం కావడంతో ఎంతో శ్రమించి చదవవలసి వచ్చింది. ఎంతో కష్టపడి చదివినను నా మార్కులు చాలా తక్కువ స్థాయిలో ఉండేవి. మనస్సంతా మార్కులు తక్కువగా వచ్చాయనే బాధలో ఉన్న కాస్త మనసు తేలిక పడుతుందని, మానసిక పోరాటాన్ని మైమరచిపోవడానికి సినిమా చూడాలని హైదరాబాద్ నారాయణగూడలో ఉన్న శాంతి సినిమా హాల్‌కి వెళ్ళాను. సినిమాహాల్‌లో సీట్లు ఫుల్ అయిపోయాయి ఇక చేసేదేమి లేక మరింత నిస్పృహ నిరాశలతో వెనుదిరిగి నడుస్తుండగా దారిలో ఒక బాప్టిస్టు చర్చి కనబడింది. అది శాంతి సినిమా హాలుకు దగ్గర్లోనే ఉంది. చిన్నతనంలో నేను విన్న విషయాలను బట్టి క్రీస్తును గూర్చిన కథలు తెలుసు గనుక కుతూహలంతో ఆ చర్చిలోకి వెళ్ళి ఖాళీగా ఉన్న బెంచీలో కూర్చున్నాను.

అలా ఒంటరిగా కూర్చున్న నాలో చెప్పనాశక్యమైన గొప్ప శాంతి నా హృదయంలో నిలిచింది. నిజదేవుని ప్రత్యక్షత సాక్ష్యాత్కారించింది. ఆనందభాష్పాలతో నా కండ్లు తడిశాయి. ఆ రోజు మొదలుకొని క్రీస్తును గూర్చి ఎవరు మాట్లాడు కున్నను చాలా శ్రద్ధతో వినేవాడిని.

ఇల్లు మారుతున్నప్పుడు అనుకోని రీతిగా స్నేహితుల ద్వారా నా వద్దకు చేరిన యేసు పటమును నా హిందు దేవతల విగ్రహాల ప్రక్కన భద్రపరచాను. ప్రతిరోజు పటంలో ఉన్న యేసుతో మాట్లాడసాగాను. క్రమంగా క్రీస్తుతో స్నేహం కుదిరింది. అనుదినం క్రమంగా యేసుతో మాట్లాడటంతోనే నా దినచర్య మొదలవ్వసాగింది. అలా ఒక సంవత్సరం గడిచింది. నాకు అపజయాన్నిచ్చిన మార్కుల విషయంలో అద్భుతం జరిగింది. నా తరగతిలో ద్వితీయ స్థానాన్ని పొందాను. నేను నాల్గవ సంవత్సరంలో చేరే సరికి మేమున్న హాస్టల్ హాలులో ఒక క్రైస్తవ బోధకుడు దేవుని వాక్యాన్ని ప్రచురించడం విన్నాను. క్రీస్తు నా కొరకై ఆ సిలువ మరణంలో చూపిన త్యాగాన్ని ధ్యానిస్తూ, ప్రార్థించి క్రీస్తును ఆహ్వానించాను. నా హృదయంలోకి చెప్పనశక్యమైన శాంతి, ఆనందం కలిగాయి. ఆ తర్వాత ఎందుకో నాకు కాస్త వణుకు భయము కలిగాయి. కారణం ఏమంటే నా నిర్ణయం గురించి నా స్వకీయులకు, స్నేహితులకు తెలిసిపోతుందేమో అని నా భయం. నా డిగ్రీ విద్యాభ్యాసం పూర్తికాగానే పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కోసం ఢిల్లీ వెళ్ళాను. నేను చదివే విశ్వవిద్యాలయంలో ఒక ప్రొఫెసర్‌గారు హిందూమత విశ్వాసం నుండి క్రీస్తును కనుగొని క్రీస్తును నమ్మి క్రైస్తవ విశ్వాసిగా ఉండేవారు. విశ్వాసంలో బలపడుటకు నన్ను అనేక బైబిల్ పఠన సమావేశాలకు

ఆహ్వానించేవారు. అది నాకెంతో ఆనందాన్ని ఇచ్చేది.

ఆ గొప్ప విశ్వాసిగా ఉన్న ప్రొఫెసర్‌గారికి క్రీస్తుపై అపారప్రేమ, తోటి విశ్వాసులపట్ల నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమించు అను యేసు ఆజ్ఞను పాటించుటకు ప్రయత్నించే వారు. అటువంటి సందర్భాలు నా విశ్వాస జీవితానికి ప్రాణం పోశాయి. ఆ ప్రొఫెసర్‌గారు ప్రార్థనలకు పొందు జవాబును బట్టి నా గురి వారి విశ్వాస జీవితమునకు ఆకర్షింపబడింది. ఢిల్లీలో పి.జి. కోర్సు ముగించిన తర్వాత పి.హెచ్.డి. కొరకు కష్టపడి చదువుకోసాగెను. నేను, మరో ఇద్దరు విద్యార్థులతో కలసి చదివేవాడిని. అయితే కేవలం రెండు స్థానాలే ఉన్నాయని తెలిసింది. అంటే మా ముగ్గురిలో ఒకరికి సీటు రాదని అర్థమైంది. నాకు, ఇంకొకరికి సీటు వచ్చింది కాని ఎందుకో వారిరువురికి సీటు రావాలని నా సీటును వదులుకున్నాను. ఆ తర్వాత జీవితం, భవిష్యత్తు గురించి ఏమి ఆలోచించలేదు, భయపడలేదు. సర్వశక్తిమంతుడైన ఆ దేవదేవుని ఆధిపత్యానికి నన్ను నేను సమర్పించుకున్నాను.

“నీ కోసం ఏర్పాట్లు తప్పకుండా చేస్తాడు, నిన్ను విస్మరించడు. దేవుని విశ్వాస్యతలో నిశ్చింతగా ఉండు. ఆయనలో నీవు వర్ధిల్లుతావు. నీ కోసం మౌనంగా ఏర్పాటు చేస్తాడు. అవి ఆశ్చర్యకరమైన అనురాగ బహుమతులు. కనీవినీ ఎరుగని అద్భుతాలు నీ కోసమే వాటిని కేవలం నీ కోసమే” అని వ్రాయబడిన ఒక క్రైస్తవ ఆధ్యాత్మిక పుస్తకంలోని మాటలు నన్నెంతో బలపరిచాయి.

ఇక నేను నా ఇంటికి తిరుగుముఖం పట్టాను. ఏదో చేయాలి గనుక నేషనల్ విశ్వవిద్యాలయం మలేషియా వెళ్ళి ఉద్యోగం చేయాలని నిర్ణయించుకున్నాను. ఆర్థిక సహాయం అందించడానికి మా నాన్నగారు నిరాకరించారు. కాని నా దేవుడు నన్ను చేరదీసారు. మలేషియాలో గ్రాఫైట్ ఇండియా లిమిటెడ్ అనే సంస్థకు ప్రభువే నన్ను సిద్ధపరచారు. మలేషియా చేరిన తర్వాత మొదటి ఆదివారం ఆలయానికి వెళ్ళాలని ఆశించి రోడ్డు మీద ఒక వ్యక్తిని ప్రశ్నించాను. వాస్తవానికి మలేషియా ముస్లిం ప్రభావిత దేశం. యాదృచ్ఛికంగా రోడ్డుపై అడిగిన వ్యక్తి కూడ దేవాలయానికి వెళ్తున్నాడు. అద్భుతంగా దేవుని దైవిక హస్తము సూటిగా తను చర్చికి వెళ్ళే దారిలో నన్ను కూడా సంధించింది. ఆ చర్చి నిజంగా బైబిలు క్రమాన్ని పాటించేదిగా ఉంది. ఆ సంఘ పాస్టరుగారు వారి సతీమణి ఆధ్వార్యాన నడపబడే బసలో చేరిపోయాను.

మరింత నమ్మకంగా ప్రభువును సంధించి వెంబడించ డానికి బాప్తిస్మము అనువైన మార్గమని నన్ను ప్రేమతో ఒత్తిడి చేశారు. అది ఆత్మీయంగా నాకు శ్రేష్ఠమని బోధించారు. నేను నిర్జీవునిగా అసహాయంగా నిలిచి ఉండిపోయాను. ఎందు కనగా నా కుటుంబీకులకు నా క్రైస్తవ నమ్మకం యెడల సదాభిప్రాయం లేనందున భయపడ్డాను. అనుకోని సంఘటన నా జీవితంలో ఎదుర్కొన్నాను. అదేమనగా ఒక రోజు సైకిల్‌పై వెళ్ళుచుండగా కారు గుద్దింది. నా సైకిల్ నా తల, కాళ్ళపైన పడింది. వెంట్రుకవాసిలో కారు టైరు నుండి కొన్ని అంగుళాలు దూరంగా పడ్డాను. అట్టి నిస్సాహాయస్థితిలో “ప్రభువా నన్ను కనికరించు నన్ను కుంటివానిగా చేయకు” అని బ్రతిమి లాడాను. నా అంతర్వాణి నాలో స్పష్టంగా మెల్లగా మాట్లాడింది “నీ కొరకెంత కాలం కనిపెట్టాలి?” అని. నా శరీర గాయాలు చేతులలో కాళ్ళలో మానిపోగానే తక్షణమే స్థానిక పాస్టరు గారిని సంప్రదించి ఆ దగ్గరులోనున్న ఒక ఆదివారం నాకు బాప్తిస్మము ఇవ్వవలసిందింగా కోరాను.

నాకు పిరికితనం, భయం పూర్తిగా తొలగిపోయాయి. క్రీస్తుప్రభుని పట్ల ప్రగాఢ ప్రేమ విశ్వాసాలు కలిగాయి. నమ్మకంగా వెంబడించాలని నిర్ణయం కలిగింది. ఇక నేను సాక్ష్యము చెప్పడం ప్రారంభించాను. నా చుట్టు ప్రక్కలవారితో క్రీస్తు ప్రేమను గూర్చి మాట్లాడడం వల్ల శ్రమలు, హింస పొందాను. ఎందుకనగా క్రైస్తవ మత ప్రచారము ముస్లిమ్ ప్రాంతంలో నిషిద్ధము. గనుక ఒక రోజు ఫిలిప్పీన్ ప్రాంతము నుండి ఒక పాస్టర్‌గారు మాకు ప్రసంగం తర్వాత వ్యక్తిగతంగా ప్రార్థించారు. వారు ప్రార్థిస్తుండగా నాకొక మంచి దర్శనం కల్గింది. నా దర్శనంలో చూచినదేమనగా కొన్ని వేలమంది ప్రజలు విశాలమైన ప్రాంతంలో చీకటి ఆవరించిన స్థలంలో అతిపెద్ద గోడలు ఉన్న ఆ స్థలమందు బందీలుగా ఉన్నట్లుగా చూచాను.

కొద్దిమందిలో నేను కూడా దేవుని స్తుతిస్తూ, ప్రార్థిస్తూ ఆ తలుపులను తెరిచి లోపల వారికి విముక్తి దయచేయాలనే ఆశతో దేవుని ఆశ్రయించాము. ఆ తలుపులు తెరువబడగా, కొన్ని వేలమంది మాతో కలసి దేవుని స్తుతిస్తూ ఘనపరచాము.

మేము దేవుని స్తుతిస్తూనే మరో కొన్ని తలుపులు యొద్దకు చేరి మరి కొందరు బందీలకు విడుదల నిచ్చాము. ఆ తర్వాత దేవుడు నాకు అమెరికలో టెక్సాస్‌లో విశ్వవిద్యాలయంలో డాక్టరేటు పి. హెచ్.డి విద్యాభ్యాసముకై ప్రవేశం లభించింది. ఆ రోజుల్లో నాకు కల్గిన దర్శనానుభవం వెంటాడేది.

అప్పుడు మలేషియా నుండి ఇండియాకు తిరిగి వచ్చాను. నేను ఇష్టపడి ప్రేమించిన అమ్మాయి కోసం కొన్ని సంవత్సరాలు వేచి ఉండి వివాహం చేసుకున్నాను. ఇద్దరం కలసి అమెరికా తరలివచ్చాము. మేమిద్దరం ఇంటింట ఆత్మీయ సహవాసాన్ని ఆరంభంచాము. దేవుని ఆశీర్వాదాలను సమృద్ధిగా అనుభవించాము. అప్పటిలో ఏడుమందితో ఆరంభించాము. దేవుని ఆశీర్వాదాలను సమృద్ధిగా అనుభవించాము. మరింత విశాల ప్రాంతంలో వసతి అనుకూలంగా ఉన్న చోట సహవాసము ప్రారంభించాము. దైవసేవకు అది గొప్ప కేంద్రీయ స్థానముగా గుర్తించాము. ప్రస్తుతం అది 270మంది సభ్యుల సమాజం.

ప్రియ స్నేహితుడా , దేవుడు నిరంతరం మన జీవితాలపై పనిచేస్తూనే ఉంటాడు. మనం ఆయన ఉనికిని అవగాహన లేక ఉపేక్షిస్తాము. ఎంతో ఓర్పుతో తీక్షణంగా మనలను సంధిస్తాడు. ఆ దేవుడు కనికరమూర్తియై మనలను వెంటాడి రక్షించి ఆదరించి కాపరిగా నమ్మకంగా నడిపిస్తారు. ప్రతి మంచి కార్యానికై నీతి ఫలాలకై మనలను రూపాంతర అనుభవానికి నడిపిస్తాడు. **-జయరాం వనమాల**

**యెహోవాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి ఆయన నామమును ప్రకటన చేయుడి. జనములలో ఆయన కార్యములను తెలియచేయుడి. కీర్తనలు 105:1**

మీ జీవితాలలో దేవుడు చేసిన మేలులను ఇతరులకు తెలియపరచుట ద్వారా దేవుని నామానికి మహిమ కలగడమే కాక వినినవారు విశ్వాసంలో బలపడుటకు మీ సాక్ష్యం ఉపయోగపడవచ్చు. కావున మీ అమూల్యమైన సాక్ష్యాలు మాతో పంచుకొనిన యెడలవాటిని సంతోషంగా పత్రికా ముఖంగా ప్రచురించుటకు మేము సిద్ధంగా ఉన్నాము. దేవుని నామ ప్రకటనలో మాతో పాటు మీరు పాలి భాగస్తులు కావాలని ఆశిస్తున్నాము.

# మీరు బైబిలంతా చదివేశారా?

దేవుడు మానవులకు ఇచ్చిన గొప్ప వరం బైబిలు గ్రంథము. ప్రపంచంలో మొదటిసారిగా ముద్రింపబడినది బైబిలు. ప్రపంచంలోనే అనేక భాషలలో, ఎక్కువ ప్రతులు ముద్రింపబడినది బైబిలు. ఈ భూమ్మీద మనం జీవించినంత కాలంలో మనల్ని సరైన మార్గంలో నడిపించేది బైబిల్ మాత్రమే. మనం దేవుని గురించి పూర్తిగా తెలుసుకోవాలంటే బైబిల్ ద్వారానే తెలుసుకోగలం. చాలామంది గంటల తరబడి ప్రార్థన చేస్తారుగాని, బైబిలు ఎక్కువగా చదవరు. ఒకవేళ చదివినా ఏదో మన అవసరానికి చదువుతారే కాని, దేవుని గురించి తెలుసుకోవటానికి చదవరు. చాలామంది వాళ్ళ జీవితంకాలంలో ఒక్కసారన్నా బైబిలును పూర్తిగా చదవలేక పోవటం చాలా శోచనీయం. చాలా భక్తిగల క్రైస్తవులకు సైతం బైబిలు ఒకసారి పూర్తిగా చదువుదామన్న ఆలోచన కూడా రాకపోవడం విచారించదగ్గ విషయం. మనం ఒకరోజులో ఎంత సమయం వృధా చేస్తున్నామో ఆ సమయంలో కొంత సమయం బైబిలు చదవటానికి కేటాయించినా బైబిలు పూర్తిగా చదవటం ఏమంత కష్టం కాదు. మనకు కష్టం వచ్చినప్పుడో, మనం అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడో బైబిలు చదవటం కాదు, ప్రతిరోజూ కొంత సమయం బైబిలు చదవటానికి కేటాయించాలి. ప్రతిరోజూ మనం టీ.వి. చూడటానికి, ఆటలు ఆడటానికి ఎంత సమయం వెచ్చిస్తున్నామో, ఎంత సమయం వృధా చేస్తున్నామో మనకు తెలుసు. మనం దేవున్ని పరిశీలనగా తెలుసుకోవాలంటే అది బైబిలు చదవటం ద్వారానే తెలుసుకోగలము. కానీ సాతాను మనల్ని ఆ పని చెయ్యనియ్యడు. ఈనాడు అనేకమంది క్రైస్తవులు చెప్తున్న కారణం బైబిలు అర్థంకావటం లేదని. ఆసక్తి లేకుండా చదివితే ఏదీ మనకు అర్థం కాదు. దేవుని గురించి పరిశీలనగా తెలుసుకోవాలన్న ఆసక్తితో చదివితే దేవుడు మనకు తప్పక సహాయపడతాడు. మీరు ఇప్పటి వరకు బైబిలు పూర్తిగా చదవకపోయినట్లయితే నేడే ప్రారంభించండి. "ఇదిగో ఇప్పుడే మిక్కిలి అనుకూల సమయం, ఇదిగో ఇదే రక్షణ దినము" 2కొరింథి. 6:2. బైబిలు పూర్తిగా చదవటాన్ని ఒక సవాలుగా తీసుకొని చదవటం ప్రారంభించండి. వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్న ఉద్దేశ్యంతో ప్రారంభించండి. ఒకసారి త్వరగా పూర్తిచేసిన తర్వాత మరలా నిదానంగా అర్థం చేసుకుంటూ చదవండి. బైబిలును ఆదికాండం నుండి ప్రారంభించి ప్రకటన గ్రంథము వరకు క్రమంగా చదవండి. అంతేకాని ఉదయం పాత నిబంధనలో సాయంత్రం క్రొత్తనిబంధనలో చదవకూడదు. బైబిలు త్వరగా పూర్తి చేయుటకు దేవుడు మీకు సహాయము దయచేయును గాక! ఆమెన్!!

చిన్నపిల్లల పేజి

# చిన్న ఓడ

బ్రూస్‌కి సముద్రమన్నా పడవలన్నా చాలా ఇష్టం. అలా సముద్ర తీరానికి వెళ్ళి దినమంతా ఆ పడవలు వెళ్తూ వస్తూ ఉండటం చూట్టం అంటే అతనికి ఎంతో సరదా. అతడు తన తల్లిదండ్రులతో ఒక పెద్ద సరస్సు ఉన్న ఒక పట్టణంలో నివశించే వాడు. ఇక ఎప్పటికైనా తన స్వంత పడవను ఆ నీలి సరస్సులో నడిపించాలని ఒక పెద్ద కోరిక.

ఒకరోజు అతని తండ్రి బ్రూస్‌ని పిలిచి "నీవు ఒక పడవను ఎందుకు చేయవు?" అని అడిగాడు. "మరి నీక్కావలసిన వస్తువులన్ని యిస్తాను, మరి నా షాపులో నీవు పడవను తయారు చేసుకోవచ్చును" అని కూడా చెప్పాడు. ఈ మాటలు ఆ అబ్బాయికి చాలా సంతోషాన్నిచ్చాయి. అతడు తాను ఓ చక్కని పడవను స్వయంగా తయారు చేశాడు. దాని మీదే వాని ప్రేమంతా ఒలక పోశాడు. దాన్ని ఎర్రరంగుతో, నీలంరంగుతో అందంగా తయారు చేశాడు. దానికి చక్కని తెల్లని తెరచాపలు దించి తన దేశ పతాకాన్ని కూడా అమర్చాడు. ఈ పడవలో మనుష్యులు కూర్చొనడానికి వీలు లేదు. కాని ఒక పెద్ద తాడుతో కట్టి ఆ సరస్సు మీద దాన్ని విహరింప చేసేవాడు. ఆ అబ్బాయి తన పడవతో ఆ సరస్సుకు వెళ్ళి తను ఈత కొడుతూ ఉంటే ఆ పడవను ఒక తాడుతో అటు ఇటు లాగుతూ ఎంతో 'గర్వంగా ఆనందంగా ఆడుకుంటూ ఉన్నాడు. ఆ సమయంలో ఓ పెద్ద అగ్ని ప్రమాదం జరిగింది. దూరాన మోత వినబడింది. బ్రూస్ గబగబా ఆ పడవను తాడుతో ఫైర్ ఇంజన్ల కట్టివేసి నలుగురితో పాటు ఆ స్థలానికి వెళ్ళాడు. అది చాలా పెద్ద అగ్ని ప్రమాదం. ఓ వీధి వీధంతా ధ్వంసమై పోయింది. బ్రూస్ అందరితో పాటు అక్కడే నిలబడి అది చూస్తూ మాన్పడి పోయాడు. చివరికి ఎలాగో ఇంటి ముఖం పట్టాడు. తన పడవ గుర్తుకొచ్చింది. పరుగెత్తి చెరువు గట్టుకు వెళ్ళాడు. కాని పాపం, తను కట్టేసిన చోట ఆ పడవ కనబడలేదు. ఎక్కడైనా దొరుకుతుందేమోనని ఆ చెరువు గట్టంతా తన ఎర్ర, నీలి పడవ కోసం కళ్ళు పొడుచుకొని చూశాడు. కాని ఆశ నిరాశే అయ్యింది. వాళ్ళ నాన్న వాడి ఏడుపు చూడలేక "పోనీ మరో పడవకొందాంలే" అన్నాడు. "కాని, అది నేను చేసింది కాదు కదా!" అని తను వద్దన్నాడు.

అలా కొన్ని వారాలు గడిచాయి. ఒకరోజు ఓ తమాషా జరిగింది. బ్రూస్ తన తండ్రితో అలా బయటకు వెళ్ళాడు. దారిలో ఒక దుకాణంలో తన పడవ, అవును తనదే, అచ్చంగా తనదే, అదే ఎరుపు నీలిరంగులు, అవే తెలుపు తెరచాపలు. నాదే నాదే, "నాన్నా అదిగో నా పడవ" అంటూ అరిచాడు. "అవునా! నీదేనా నిజంగా" అన్నాడు వాళ్ళ నాన్న. "అవును నాన్న చూడు, ఆ ముందర ఉన్న గుర్తు చూశావా" అన్నాడు. "కాని బ్రూస్ దీనికి వెల కట్టి ఉందే? దీనిని అమ్మకానికి పెట్టారు" అన్నాడు వాళ్ళ నాన్న. సరేనని దుకాణంలోకి వెళ్ళారు ఇద్దరూ. వెంటనే బ్రూస్ "ఏమండీ ఈ పడవ మీదికాదు" అని అరిచాడు. కాని వాళ్ళ నాన్న నెమ్మదిగా ఆ దుకాణందారుడికి సంగతంతా వివరించాడు. అప్పుడు ఆ దుకాణందారుడు అయ్యా ఈ పడవను నేను ఆ అగ్ని ప్రమాదం జరిగిన రాత్రి ఓ జాలరి దగ్గర కొన్నాను అని చెప్పాడు. మరి బ్రూస్ తట్టు తిరిగి బాబూ ఒక పని చేయి. నీవు నేను ఆ బెస్తవానికిచ్చిన పైకము నాకిచ్చివేస్తే ఈ పడవను నీకియ్యగలను, అప్పుడు నాకు కూడ నష్టం ఉండదు కదా! ఇది నీకు ఇష్టమేనా అని అడిగాడు.

బ్రూస్ మొహంలో వెలిగిన ఆ వెలుగే ఆ ప్రశ్నకు సమాధానం. వెంటనే తన స్వహస్తాలతో చేసిన ఆ పడవను తన స్వంత డబ్బు వెచ్చించి కొనుక్కున్నాడు. ఎంతో ప్రేమతో ఆ పడవను తన గుండెకు హత్తుకొని నా చిన్ని పడవా, ఇప్పుడు నీవు రెండవసారి నా దానివయ్యావు. ఒకసారి నిన్ను చేసినప్పుడు, రెండోసారి నిన్ను కొన్నప్పుడు. తండ్రి ఈ మాటలు వింటూ కొడుకు ఆనందానికి సంబరపడ్డాడు. మనమందరము మనల్ని సృజించిన గొప్ప దేవుని నుండి గొఱ్ఱెలవలె తొలగిపోయాము. కాని ఆయన తన ప్రియ కుమారుని పంపి మనల్ని తిరిగి కొనటానికి, తన ప్రశస్త మైన రక్తాన్ని ఆ సిలువ మీద కార్చాడు. కాబట్టి మనం ఇప్పుడు రెండుసార్లు ఆయన వాళ్లము. మొదట ఆయన

మనల్ని సృజించాడు. మనం ఎప్పుడైతే క్రీస్తుని మన రక్షకునిగా అంగీకరిస్తామో అప్పుడు మనం ఆయన బిడ్డలమై ఆయనకే చెందుతాము. మనం అందరం కళ్ళు మూసుకుని తలలు వంచి దేవుని ఎదుట జాగ్రత్తగా ఆలోచించుదాం. క్రీస్తే మీ యొక్క నిజమైన రక్షకునిగా అంగీకరించుటకు సహాయం చేయగలము. మీరు అలాగే తలలు వంచి నాతో కూడ ఈ ప్రార్థన చేయండి ప్రియమైన యేసయ్యా, నేను ఎన్నో పాపాలు చేశాను. నన్ను క్షమించండి. నా హృదయంలోకి రండి నా పాపాల నుండి నన్ను విముక్తుడిగా చేసి నన్ను నీ బిడ్డగా చేయండి. నన్ను ఇంతగా ప్రేమించినందుకు మీకు వందనములు. ప్రతిదినం, ప్రతిక్షణం నేను నీ కిష్టమైన పనులే చేయులాగున నిన్ను నా పూర్ణ హృదయంతో ప్రేమించులాగున చేయండి. ఆమెన్!

## చందాదారుల వివరములు

1. అపొ. ఎబినేజర్‌గారు (హైదరాబాద్)–1500 (నెలకు)
2. దాసరి శ్యామ్ హయ్యర్ పాల్ – 2000 (నెలకు)
3. గంధం డేవిడ్ నీలకాంత్ (నెల్లూరు) –1000 (నెలకు)
4. మేరిసలోమి, సిరివెళ్ళ, కర్నూలుజిల్లా 5000/–
5. ముద్ద సామ్యేల్ విల్సన్ – 500 (ప్రతి నెల)
6. జి. స్టాలిన్ (కావలి)
7. పాస్టర్ కంచెర్ల ప్రభుదాస్ (గుంటూరు)
8. సుమతి చక్రవర్తి
9. దాసరి. మాధవరావు
10. వి. రత్నమ్మ, హైదరాబాద్ 350/–
11. జి. కళావతి, ఒంగోలు 350/–
12. వి. కస్తూరి, భీమవరం 500/–
13. జయ, గుంటూరు – 1500/–
14. కె. రజిని, నరసరావుపేట – 1000/–
15. శ్రీమతి శాంతాగ్రేస్, మచిలీపట్నం 500/–
16. శ్రీమతి కె. కల్పన, గోవా – 350/–
17. శ్రీ జి. వెంకటేశ్వర్లు, కొత్తపల్లి – 350/–
18. శ్రీమతి సి. హెచ్. స్వయంప్రభ, చిలకలూరిపేట – 350/–

**పరిశుద్ధగ్రంథ పరిశోధనా పట్టిక – 11 జవాబు**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 తీ | 2 పి | ■ | 3 ము | క్క | 4 లు | ■ | 5 గా | 6 లి |
| 7 గె | తీ | చ్చ | గ | ■ | 8 కు | ష్ఠ | రో | గి |
| లు | ■ | ■ | 9 స | 10 లో | మే | ■ | ■ | అం |
| ■ | 11 వు | 12 ఆ | ■ | ఆ | ■ | 13 హో | 14 ఆ | ■ |
| 15 పే | తు | రు | యా | కో | బు | యో | హా | ను |
| ■ | 16 హే | లీ | ■ | రు | ■ | 17 యో | బు | ■ |
| 18 ప్ర | ■ | ■ | 19 ప | య | క | ■ | ■ | 20 పా |
| 21 తి | 22 మ్మి | ల | షూ | ■ | 23 మా | లి | న్య | ము |
| 24 మ | న | ■ | 25 రు | ఖా | సు | ■ | 26 అ | ల |

**పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక – 11**
**సరైన జవాబులు పంపించిన వారు**

1. డి. మెర్సీ ఇశ్రాయేల్, నెల్లూరు
2. కె. రూత్ ఇవాంజిలిన్, హైదరాబాద్
3. టి. హదస్సా, ఆదిలాబాద్
4. కె. దివ్యవాణి, బెంగుళూరు
5. శ్రీమతి బి. ఆనీమేరి, హైదరాబాద్
6. యం. సామ్యేల్‌రాజ్, నంద్యాల
7. బి. కృపారావు, కాకినాడ
8. జి. సుశీల, విజయవాడ

## ప్రకటన

**క్రైస్తవ కథలు, వ్యాసాలు, రచనలు, కవితలు, పాటలు మొదలగునవి మా ప్రియ పాఠకుల నుండి కోరడమైనది. ఆసక్తి గలవారు తమ తమ భావాలను మా పత్రిక ద్వారా పాఠకులకు అందించవచ్చు. ఉత్తమ కథకు నగదు బహుమానం వుంటుంది. క్రైస్తవకథ ఏదైనా 2 పేజీలకు మించకూడదు.**

# కృపాదానం

బ్రేస్టడ్స్ దొర ఒంగోలు మిషన్ హాస్పిటల్ (క్లౌ మెమో రియల్)కు డాక్టరుగా వచ్చిన తర్వాత దేవుడు ఆయన భార్యను ప్రేరేపించినందున గుంటూరులోని ఎ.సి కాలేజిలో చదువు తున్న కృపాదానం పెద్దకొడుకు శ్యామ్‌కు బాప్టిస్టు స్టూడెంట్సు సెంటర్‌లో మెస్ ఫీజు కట్ట నిశ్చయించినది.

గుంటూరులో కన్నావారితోటలో ఉన్న ఆ బంగళాకి కేరి హాలు అని పేరు. గుంటూరులోని బాప్టిస్టు చర్చ్ కన్నావారి తోట 5వ లైను చివరలో ఒక పొడవైన తాటాకుల పర్ణశాలలో ఆదివారము ప్రార్థన పెట్టేవారు.

కేరీ హాలు లోనే ఆడమ్స్ దొర ఒక రూమ్‌లో ఉండేవాడు. నేను ఒంగోలులో యస్.యస్.ఎల్.సి చదువుతున్నప్పుడు అనేకమార్లు ఆడమ్స్ దొరను చూచినప్పటికి ఒక సాధారణ 25 ఏండ్ల యవ్వనస్తునివలె అనుకున్నానే తప్ప ఆయన ఒక మిషనరీ అని గ్రహించలేదు.

ఆడమ్స్ దొర కుటుంబంతో కాక ఒంటరిగా సేవ చేస్తు న్నాడు కనుక కేరీ హాలులోనే ఒక రూంలో స్టూడెంట్సుతోనే ఉండేవాడు. చిన్నపిల్లవానివలె యవ్వనస్తులతో ఆటలాడే ఆయన మిషనరీ ఎలా అవుతాడు అనుకున్నాను.

హాస్టల్ రూంలో నివశించటం ప్రారంభించిన తర్వాత సీనియర్ స్టూడెంట్సుతో కుస్తీలు పట్టేవాడు. ఆయన సైకిల్ క్రొత్త మోడల్. ఎవరైనా వాడుకోవచ్చు.

ఒకరోజు నేను కాలేజికి వెళ్ళకుండా హాస్టల్‌లో ఉండగా ఆ మిషనెరీ వచ్చి కాలేజికి ఎందుకు వెళ్ళలేదు? అని అడిగాడు. గ్రూపు మార్చుకున్నాను. నలభై రూపాయలు కట్టాలి కాని డబ్బులు లేవు అందుకని వెళ్ళలేదు అన్నాను. ఆయన తన జేబులో నుండి రెండు 20 రూపాయల కాగితాలు తీసి ఇచ్చాడు. ఈ రోజుల్లో అయితే వాటి విలువ నాలుగు వందలపైనే.

ఆంధ్రా క్రిస్టియన్ కాలేజి లూథరన్ మిషనరీ సంబంధిం చినది. కాలేజిలో సోషల్ వెల్‌ఫేర్ వాళ్ళ స్కాలర్‌షిప్ ఫారాలు అయిపోయాయి. బాప్టిస్టు స్టూడెంట్సులో ఎవరికి స్కాలర్‌షిప్ ఫారాలు అందలేదు. ఫారాలు సబ్మిట్ చేయవలసిన సమయం దగ్గర పడుతుంది. అయితే ప్రభువు సహాయం కొరకు ఎదురు చూడటం తప్ప ఏమి చేయలేని పరిస్థితి మాది.

ఒంగోలు నుంచి వచ్చిన వారి దగ్గర ఎవరి దగ్గర అప్లికేషన్లు లేవు. నాటి బాప్టిస్టు మిషెనరీ ఆడమ్స్ దొర ప్రేమకు ప్రతిరూపం. ఆయన సొంత డబ్బుతో, ఒక సెట్‌లో పది డమ్మిసైజు పేపరులు ఉన్న వంద ఫారాలు ప్రెస్‌లో ప్రింటు చేయించి కేరి హాలులో ఉన్నవారందరికి తలా ఒకటి ఇచ్చాడు. అంతేకాక ఒంగోలు విద్యార్థులు వారు ఇండ్లకు వెళ్ళటానికి చార్జీలు కూడా ఇచ్చి ఆ ఫారాలు పూర్తి చేసి తండ్రి చేత సంతకాలు తీసుకొని రమ్మన్నాడు. అవి సబ్మిట్ చెయ్యటానికి రెండు రోజులు మాత్రం గడువు ఉన్నది.

ఆడమ్స్ దొర కేరీ హాలులో ఉండటం వలన బాప్టిస్టు స్టూడెంట్స్‌కు కొంత సహాయం దొరికింది. ఆ సహాయం పొందిన వారిలో నేను ఒకడ్ని.

ఆ స్కాలర్‌షిప్ ఫారాలతో పాటుగా కాలేజిలో ఫీజు కన్‌సెషన్ ఫారాలు ఒక పేజి ఉండేవి ఇచ్చారు. అదేమంటే ఎ.సి.కాలేజిలో స్టూడెంటు తండ్రి మాత్రమే కన్వర్టు క్రైస్తవుడై యుండాలి. తాత క్రైస్తవుడైతే ఫీజు కన్సెషన్ ఉండదు. అంటే తండ్రి ఈ మధ్య క్రైస్తవుడై, వారు మొదటి నుండి క్రైస్తవులు కాకపోతే సంవత్సరానికి 66 రూపాయలకు బదులు 6 రూపాయలు కడితే చాలు.

1957 నాటికి ఒంగోలు నుండి 23 మంది విద్యార్థులు గుంటూరులో చదువుతున్నారు. అందరూ ఫారాలు తీసుకొని దొర ఇచ్చిన చార్జీలతో ఒంగోలు వచ్చి మరునాడు గుంటూరు ప్రయాణంమైనారు. ఒంగోలు రావడానికి ఆడమ్స్ దొర డబ్బులు ఇచ్చాడు, మరి తిరిగి గుంటూరు చేరుటకు ఎలా అనుకునేంతలో ఒక మిషనరీ గుంటూరు వెళ్తూ నలుగురు విద్యార్థులను మాత్రం తనతో కారులో గుంటూరు

తీసుకెళ్తానన్నాడు ఒక మిషనెరీ దొర. వారిలో కృపాదానం కొడుకు శ్యామ్ ఒకడు.

దేవుడు అడుగడుగునా ఆయన వాత్సల్యతను చూపిస్తాడు అనుటకు ఈ అనుభవాలే సాక్ష్యాలు. తండ్రి తన బిడ్డల గురించి ఎంత జాగ్రత్త వహిస్తాడో అలానే మనందరి పరమ తండ్రి కూడ తన బిడ్డలపట్ల ఖచ్చితంగా బాధ్యత వహిస్తాడు అని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. ఏదో పెద్ద సమస్య వస్తేనే దేవుని వైపు చూస్తాం మనం కానీ దేవుడు తన బిడ్డల గురించి ప్రతి విషయంలో, అది చిన్నదైనా, పెద్దదైనా ఆయన తోడుండి ప్రతి పనిని ఆశ్చర్యకరమైన రీతిలో సఫలపరుస్తాడు.

1957లో కృపాదానం పెద్దకుమారుడు శ్యామ్ గుంటూరు ఎ.సి. కాలేజిలో ప్రీ యూనివర్సిటి చదువుతున్నప్పుడు ఫీజు రాయితీ కొరకైన కొన్ని కాగితాలు కాలేజి నుండి తీసుకొని వచ్చాడు.

ఆంధ్రా క్రిష్టియన్ కాలేజిలో చదివే క్రైస్తవ విద్యార్థుల యొక్క తాత క్రైస్తవుడైతే ఫుల్ ఫీజు అరవై ఆరు రూపాయలు కట్టాలి. తాత క్రైస్తవుడు కాక తండ్రి క్రొత్తగా క్రైస్తవుడైనట్లయితే ఆరు రూపాయలు మాత్రమే చెల్లించాలి. అందుకు సంబంధించిన అప్లికేషన్ ఫారాలపై తండ్రి సంతకం చేసి తర్వాత సంబంధించిన మిషెనరీ సంతకం చేసి ధృవీకరించాలి. స్థానిక మిషనెరీ చేత ధృవీకరించబడిన కాగితం కాలేజిలో ఇస్తే ట్యూషన్ ఫీజు, సంవత్సరమునకు ఆరు రూపాయలు మాత్రం చెల్లించవచ్చును.

నాడు ఒంగోలు నుండి గుంటూరు వెళ్ళి ఎ.సి.కాలేజిలో చదువుచున్న 23 మంది విద్యార్థుల తాతలందరూ క్రైస్తవులే, కాని మిషనెరీగారు తండ్రి మాత్రమే క్రైస్తవుడని అందరికి సర్టిఫికేట్స్ ఇచ్చియున్నారు. కృపాదానంగారి తండ్రి జోసఫ్‌గారు కూడా క్రైస్తవుడే కనుక ఆ ఫీజు కన్సెషన్ తన కుమారునికి వర్తించదు. కనుక సంతకం చేయుటకు కృపాదానం సమ్మతించలేదు. ఆ అప్లికేషన్ మీద తాత కూడా క్రైస్తవుడని రాసి ఇచ్చాడు. సంతకం చెయ్యలేదు కనుక ట్యూషన్ ఫీజు 66 రూ. చెల్లించాలి.

కృపాదానం తన తండ్రి క్రైస్తవుడు కనుక దొంగ సర్టిఫికెట్ పెట్టను అన్నాడు. మరి 66 రూ. ఫీజు కట్టాలి అన్నాడు శ్యామ్. కడతాను అన్నాడు తండ్రి.

ఎప్పుడు? అంటే, దేవుడు ఇస్తాడు అన్నాడు.

తండ్రితో వాదించలేక, సంతకం పెట్టుటకు ఆయనను సమ్మతింప చేయలేకపోయాడు శ్యామ్. చేసేది లేక స్కాలర్ షిప్ కాగితాలతో తిరుగు ప్రయాణమైనాడు. ఒక మిషనరీ సహాయంతో అతని కారులోనే గుంటూరు చేరినాడు శ్యామ్.

గుంటూరు ఎ.సి.కాలేజిలో తన స్కాలర్‌షిప్ సంబంధిత కాగితాలను సబ్మిట్ చేశాడు. కాలేజీలో హెడ్‌క్లర్క్ లాజరుగారు శ్యామ్‌ను పిలిచి ఫీజు కన్‌సెషన్ కాగితం ఏది? అన్నాడు.

మా నాయన అబద్ధం సంతకం చెయ్యనన్నాడు సార్! అన్నాడు శ్యామ్.

ఈ కాలేజిలో అందరి తాతలు క్రైస్తవులే. కాని అన్ని ఊర్ల నుండి మిషనరీలు సంతకాలు చేశారు కదా. మీ ఒంగోలులో మార్టిన్ దొరగారు కూడా అందరికి సంతకాలు చేశాడు కదా!

మా నాయన అబద్ధం ఆడనన్నాడు సార్ జవాబిచ్చాడు శ్యామ్.

సరే మరి అరవై ఆరు రూపాయలు ఇచ్చారా? అన్నాడు లాజరస్ గారు.

డబ్బుల్లేవు, తర్వాత పంపిస్తానన్నాడు సార్! అన్నాడు శ్యామ్.

లాజరస్‌గారికి కోపం వచ్చింది. ఆయన శ్యామ్ వైపు చూచి అది కుదరదు, అకౌంటు క్లోజు చెయ్యాలి, నువ్వు పెట్టరా మీ నాయన సంతకం అన్నాడు చిన్నగా.

లాజరస్‌గారు కొంచెం ఆగి నువ్వు సంతకం చెయ్యకపోతే ఫైనల్ పరీక్షలు మర్చిపో! అన్నాడు.

అప్లికేషన్ మీద కృపాదానం సంతకం పెట్టని కారణంగా, 66 రూపాయల ఫీజు కట్టవలసి వచ్చింది. ఫీజు కట్టడానికి డబ్బులు లేవు. ఫీజు కట్టనందు వలన హాల్‌టికెట్టును ఆపి, ఫీజు చెల్లిస్తేనే విడుదల చేస్తారని చెప్పారు కాలేజి యాజమాన్యం. **(సశేషం)**

13

# దేవుడు - సిరి

కానుకల పెట్టెలో కానుకలు వేయుచున్న ధనవంతులను ఆయన పారచూచెను. వాళ్ళు వారి ఆదాయంలో తమ ఇంటికొరకు, పిల్లల కొరకు, హోదా కొరకు ఎంత ఖర్చు పెడుతున్నారో వాటిలో దేవునికి ఇవ్వవలసిన కానుక ఎన్నో స్థాయిలో ఉన్నదో ప్రభువుకు తెలుసు. వారి కానుకలు యేసుకేమీ సంతోషం కలిగించటం లేదు. కాసేపటికి ఓ బీద విధవరాలు వేసిన కానుకతో యేసు కండ్లు మెరిశాయి. ఆమె వేసింది కేవలం రెండు కాసులు. ఈమె తనకు కలిగిన జీవనమంతయు వేసెను కావున అందరికంటే దేవునికి ఎక్కువ ఇచ్చింది ఈమె అని తన శిష్యులతో చెప్పాడు.

లేనివారికి ఇతరుల సహాయం కోరి నిలుచున్న వారికి మనం ఇస్తాము. ధనవంతులు కానుక పెట్టెలో సొమ్ము వేసేటప్పుడు వారు ఇచ్చే సొమ్ము కంటే వారి హృదయం యేసుకు స్పష్టంగా కనబడుతున్నది. దేవుడు చెప్పాడని, చందా వేయాలని భారముతో దేవునికి ఇస్తున్నామా? ఆలోచించు పాఠకా! ఇక్కడ దేవునికి ఇస్తున్నవారు లోకం చూడాలని, లేక దేవుని ఆజ్ఞ అని ఎన్నో బేరీజులు వేసుకొని ఎంతో ఆలోచించి అందరి ముందు పెట్టెలో వేస్తున్నారు. అయితే ఒక బీద విధవరాలు (ఆమె లోకం దృష్టిలో బీదది) దేవుని దృష్టికి అక్కడ ఉన్న వారందరికంటె ధనవంతురాలు. పరలోకంలో ధనం దాచుకొనిన ధనవంతురాలు. దేవుని దగ్గర దాచిన సొమ్ము ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా ఎవ్వరు వాడలేరు. చివరికి కంటికి కనిపించని చిమ్మెట కూడా ఆ ధనమును తాకలేదు. ప్రభువు దగ్గర లెక్కలపట్టి ఉన్నది. తనకు ఎంతమంది అప్పు ఇస్తున్నారో వారికి తనెంత ఇవ్వాలో లెక్క ఉన్నది. బీదలను కనికరించు వాడు యెహోవాకు అప్పిచ్చువాడు. వాని ఉపకారమునకు ఆయన ప్రత్యుపకారము చేయును (సామెతలు 19:17).

మనిషి యొక్క బీదతనానికి మనం ఇస్తున్నాం. అది దేవుని పేరు మీద ఇస్తున్నాం. దశమభాగంను మందిరంలో గాని, వ్యక్తిగతంగా కాని ఇచ్చేటప్పుడు వాళ్ళు దానిని ఎలా ఉపయోగి స్తున్నారు అనేది అసలు అవసరంలేదు. మన హృదయం నిష్కపటంగా ఉండి, మన జీవనం దేవునికి ఇస్తున్నామనే నమ్మకం మన హృదయంలో ఉంటే అలా మనం ఇచ్చిన సొమ్ముకు దేవుడే జవాబు దారి కాని తీసుకొనిన వారు కాదు. దేవుని మీద విశ్వాసంతో ఇవ్వాలి. ఆయన ఆ కానుకను చూస్తున్నాడు. అయినా దేవుని దగ్గర ఏదో కోరి మనం ఇచ్చేది కానుక కాదు. ఆయన చేసిన, చేస్తున్న ఉపకారములకు మన హృదయం పొంగి కృతజ్ఞతతో ఇస్తున్నాం. మన జీవనమునకు మూలమైన గాలి, నీరు, ఉచితంగా పొందు తున్నాము. దేవుని మీద నమ్మకం లేనివాళ్ళు డబ్బు పెట్టి కొనిన నీరు శ్రేష్ఠం అనుకొంటారు. నిజానికి డబ్బు పెట్టి నీరు కొనిన వారికంటే దేవుడిచ్చిన నీరు ఉచితంగా త్రాగేవారే హాస్పిటల్ పాలు కావటంలేదు.

డబ్బు పెట్టి ఏ మానవుడు ఈ లోకంలో ఆరోగ్యంగా జీవించలేడు. మన హృదయానికి ప్రతిఫలంగా ఇస్తున్నది ఆయన చేసిన ఉపకారములలో దేనిని మరువకుమని తనలో తాను తర్కించుకొనే వారికే అర్థమౌతుంది. ఉచితంగా డబ్బులు పొందాలని బీదలను అడ్డం పెట్టుకొని డబ్బు సంపాదించాలని, దేవుడి పేరున డబ్బు సంపాదించాలని ఆలోచించే వారికి ఆయన చేసిన ఉపకారములు అర్థం కావు. ఆలోచించలేరు.

ఈ లోకంలో మన జీవనమునకు మూలం దేవుని కృప. భూమి అంతటిని పోషిస్తున్నాడు, పోషిస్తాడు. దేవుని ప్రేమ మానవుల యెడల అలా ఉన్నది అని విశ్వసించినవాడు కుటుంబ నియంత్రణను గురించి ఆలోచించడు. కాలములు సమయములనుబట్టి దేవుని శక్తిలో మార్పు ఉండదు. దేవునికి ఆయన కృపకు హద్దులు పెట్టే బుద్ధిహీనులకు దేవుని విషయాలు వెర్రితనముగా ఉంటాయి. దేవుణ్ని గ్రుడ్డిగా నమ్మకూడదు అనేవాడు గ్రుడ్డివాడు. 'కాగా దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తు యేసు నందు మహిమలో మీ ప్రతి అవసరమును తీర్చును' (ఫిలిప్పీయులకు 4:19) అని ఆశీర్వదించిన తర్వాత అది జరగదా?


మన హృదయం మన జీవనం ప్రభువు దృష్టిలో విశాలంగా కనబడితే ఆయన కృపగల చూపును మనం తప్పించుకోము. ఆశీర్వాదము నా దేవుని వాగ్దానమని విశ్వసించాలి.

# దేవుడు మీ కన్నీరు తుడుస్తాడు

ఈ లోకంలో అనేకమంది ప్రతిరోజూ ఏడుస్తూనే ఉంటారు. వాళ్ళు ఏడవడానికి అనేక కారణాలు ఉంటాయి. మనుష్యులు వాళ్ళ కొరకు ఏర్పరచుకున్న అనేక తంత్రాలు వారి ఏడుపుకి కారణమవుతాయి. ఉద్యోగం రాలేదని, ఉద్యోగం వస్తే ఆఫీసులో సమస్యల వలన, వ్యాపారంలో నష్టం వచ్చిందని, బిడ్డలు పుట్టకపోతే ఏడుపు, పుడితే బిడ్డల వలన తల్లిదండ్రులు, తల్లిదండ్రుల వలన బిడ్డలు, పెళ్ళి కాకపోతే ఏడుపు, పెళ్ళి చేసుకుంటే భార్యా భర్తల మధ్య సఖ్యత లేక, బంధుమిత్రుల వలన ఇలా చాలా రకాల సమస్యల వలన ప్రతి ఒక్కరూ ఏదో ఒక సందర్భంలో ఏడ్చే పరిస్థితి వస్తుంది. కొంతమంది ప్రతిరోజూ ఏడుస్తూ ఉంటారు. కొంతమంది అప్పుడప్పుడు ఏడుస్తుంటారు. అయితే మనుష్యులు ఏడవాలని దేవుడు ఎప్పుడూ కోరుకోడు. మనుష్యులు దేవునికి దూరమయ్యి ఈ లోకానుసారంగా జీవించేటప్పుడు ఈ లోకం మనుష్యుల కిచ్చేది ఏడుపు మాత్రమే. మరణించిన వారి విషయంలో ఏడవడం అన్నది సహజమైనది. కానీ మనం కల్పించుకున్న పరిస్థితుల వల్ల ఏడవాల్సి వస్తే దానికి మనమే బాధ్యత వహించుకోవాలే కానీ దేవున్ని నిందించకూడదు. ఈ లోకానుసారంగా ఏడవాల్సి వచ్చినప్పుడు అది ఒక్కోసారి బలవన్మరణాలకు దారి తీస్తుంది. సాతాను యొక్క తంత్రాలకు బానిసలైన వారికి మిగిలేది ఏడుపే. దేవున్ని హృదయ పూర్వకంగా నమ్మేవారు ఎలాంటి స్థితిలో ఉన్నా కూడా వారికి ఏడుపురాదు. ఒకవేళ వారు కన్నీరు కార్చాల్సిన పరిస్థితి ఎదురైనప్పుడు దేవున్నిబట్టి ఎంతో ధైర్యంగా ఉంటారు. ఒక్కోసారి దేవుడు మనకి పెట్టే పరీక్షలను ఎదుర్కొనేటప్పుడు కూడా మనం కన్నీరు కార్చాల్సిన పరిస్థితి వస్తుంది. బైబిల్లో దేవుని బిడ్డలు అని చెప్పబడిన వారు కూడా ఏడ్చిన సంధర్భాలు అనేకం ఉన్నాయి. శ్రమలు వచ్చినప్పుడు దావీదు ఏడుస్తూ మొఱ్ఱపెట్టి వ్రాసిన కీర్తనలు అనేకం. 'నేను మూలుగుచు అలసియున్నాను ప్రతి రాత్రియు కన్నీరు విడుచుచు నా పరుపు తేలజేయుచున్నాను. కన్నీళ్ళచేత నా పడక కొట్టుకొని పోవుచున్నది' (కీర్తనలు 6:6) అని తన హృదయములోని ఆ తెలియజేశాడు. 'నేను దేవుని తట్టు దృష్టియుంచి కన్నీళ్ళు ప్రవాహముగా విడుచుచున్నాను' (యోబు 16:21) అని సర్వం కోల్పోయిన యోబు అన్న మాటలు ఆయన హృదయవేదనను తెలియచేస్తున్నాయి. అయినప్పటికీ ఆయన చనిపోకుండా దేవున్నిబట్టి ధైర్యంగా ఉన్నాడు. దేవుని బిడ్డలు కూడా చాలా సందర్భాల్లో ఏడవాల్సిన పరిస్థితులు వస్తాయి. వారి విషయంలో కాకపోయినా దేవుని నిమిత్తము ఇతరుల వలన హింసలనుబట్టి వారి హృదయములోని ఆవేదన కన్నీటి రూపంలో బయటకి వస్తుంది. అయితే దేవుడు వారి కన్నీటిని తుడవడానికి ఎప్పుడూ సిద్ధంగానే ఉంటాడు. మన దుఃఖము దేవుని సంబధమైనప్పుడు దేవుడు మనల్ని ఓదార్చడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాడు. 'దుఃఖపడువారు ధన్యులు వారు ఓదార్చ బడుదురు' (మత్తయి 5:2). కాబట్టి మనం దేవుని బిడ్డలుగా జీవిస్తే దేవుడే మన కన్నీటిని తుడిచి మనలను ఓదారుస్తాడు.

'హన్నాకృప' పత్రిక కావాలని అనేకమంది ఉత్తరాల ద్వారా, ఫోన్స్ ద్వారా అడుగుతున్నారు. "మీ పత్రిక ఫలానా చోట చూశాము. మా అధ్యాత్మిక జీవితానికి ఎంతో మేలు కరంగా ఉంది. దయచేసి మాకు కూడా పంపండి. మేము చందా కడతాము" అని అడుగుతున్నారు. అలా అడిగిన వాళ్ళందరికీ పంపాలంటే ఇప్పుడు చందా కట్టకుండా ఉచితంగా పత్రిక పొందుతున్న వాళ్ళందరికీ ఆపాలి. నేటి పరిస్థితులలో పత్రిక నిర్వహణ చాలా వ్యయప్రయాసలతో కూడుకొని ఉన్నప్పటికీ, కేవలం విశ్వాసము ద్వారానే ఈ పత్రిక నడుపగలుగుతున్నాము. అయితే పాఠకులు చందా కట్టడం తమ బాధ్యతగా గుర్తించాలి. ఎందుకంటే మీరు చందా కట్టటం వలన ఇంకా అనేకమందికి పత్రిక పంపడానికి సాధ్యమవుతుంది. సంవత్సరమంతటికీ కలిపి కేవలం 350/- రూపాయలు అన్నది ఎన్నతగినది కాదు. కావున పాఠకులు సహృదయంతో ఆలోచించి చందా కట్టవలసినగా ప్రభువు పేరట వేడుకొనుచున్నాను.

**– ఎడిటర్**



# పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పత్రిక -12

**అడ్డం :**

1. మోషేను వెంబడించిన ఇశ్రాయేలీయుల పాదచారుల సంఖ్య (5) (నిర్గమ)
6. నీవిచ్చిన వాక్యమును నేను ధ్యానించుటకై నా కన్నులు ----లు కాకమునుపే తెరుచుకుందును (4)(కీర్తనలు) (మొదటి సగం వెనుకబడింది)
7. గనుక వారు భూలోకమును ఏలుదురని క్రొత్తపాట ---- (4) (ప్రకటన)
8. హెబ్రోను భూభాగాన్ని యెహోషువ నుండి పొందిన వాడు మరియు అతని తండ్రి పేరు (6) (యెహోషువ)
12. దర్శనపు లోయలో యెహోవా నియమించిన దినము (6) (యెషయా) (కుడి నుండి ఎడమకు)
15. అంజూరు చెట్లు పూయకుండినను, ద్రాక్షచెట్లు ఫలింపక పోయినను----నేను యెహోవాయందు ఆనందించెదను అనిన ప్రవక్త (4) (తారుమారు)
16. పౌలు సీలలు కీర్తనలు పాడగా దీని పునాదులు అదిరెను(4) (అపొ.కా) ( కుడి నుండి ఎడమకి)
17. ఇశ్రాయేలీయులపై-----చేయించు అధికారులను నియమించెను (5) (నిర్గమ) (తారుమారు)

**నిలువు :**

2. ఇశ్రాయేలీయులు యెరికో చుట్టు ప్రదక్షిణ చేసినప్పుడు వారి ముందు నడిచిన యాజకులెందరు? (4) (యెహోషువ) (క్రింద నుండి పైకి)
3. అది ద్రాక్షా పండ్లు కాయునని నేను కనిపెట్టి నప్పుడు అది ---- కాయుటకు కారణమేమి? (4) (యెషయా) (క్రింద నుండి పైకి)
4. దావీదు గొల్యాతు తలను తీసుకొని ఎక్కడికి వచ్చెను? (5) (1సమూ) (తారుమారు)
5. పగలు ఎండదెబ్బయైనను నీకు తగులదు.----- దెబ్బయైనను నీకు తగులదు (5) (కీర్తనలు)
9. వీరు దేవుడు నీ సేవకునికి దయచేసిన ---. అని యాకోబు ఏశావుతో చెప్పెను(3) (ఆది)(తారుమారు)
10. ఆయన తన------ఆలకించి నా ప్రార్థనంగీ కరించెను (5) (కీర్తనలు) (క్రింద నుండి పైకి)
11. -----న మగ్దలేనే మరియ యేసు సమాధిని చూడవచ్చెను (5) (మత్తయి)
13. మోషే సహోదరుడు (4) (నిర్గమ)
14. అడుగుడి మీకియ్యబడును.----మీకు దొరుకును. (4) (లూకా) (క్రింద నుండి పైకి)

1. AUTHOR does hereby assign, transfer, and convey unto ASSIGNEE, the entire right, title, and interest in and to said WORKS and in and to any and all copyrights on said WORKS that may arise and/or may be granted in the Andhra Pradesh/India and any foreign country, and including each and every derivative WORK arising from said WORKS.

2. AUTHOR does hereby covenant and agree to cooperate with ASSIGNEE whereby ASSIGNEE may enjoy to the fullest extent the right, title, and interest herein conveyed. Such cooperation shall include:

a) Prompt execution of all papers which are deemed necessary or desirable by ASSIGNEE to perfect in it the right, title, and interest herein conveyed;

b) Prompt execution of all petitions, oaths, specifications, declarations or other papers which are deemed necessary or desirable by ASSIGNEE for obtaining copyright registration in the Andhra Pradesh/India and/or foreign countries covering said WORKS or works derived from said WORKS; and

c) Prompt assistance and cooperation in the prosecution of legal proceedings involving said WORKS or derivative works therefrom, said registrations granted thereon, including proceedings before any Copyright Office of the Andhra Pradesh/India or any foreign country, and court actions, provided, however, that the expense which may be incurred by said AUTHOR in lending such assistance and cooperation be paid by ASSIGNEE.

3. The terms, covenants, and provisions of this assignment shall inure to the benefit of ASSIGNEE, its successors, assigns, and/or other legal representatives, and shall be binding upon said AUTHOR, his respective heirs, legal representatives, and assigns.

4. AUTHOR warrants and represents that he has not entered into any assignment, contract, or understanding in conflict herewith.

NOTARY
Prakasam District (A.P.)

ATTESTED

B. SURYANARAYANA
Advocate Notary
Regd. No. 10/09
Opp: Municipal Office, ONGOLE
Prakasam (Dt.) (A.P.) India
Cell: 9573909169

17/5/2023